- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక


శుక్రవారం
17-07-2026

సంపుటి : 01 సంచిక :115 పేజీలు : 08 వెల : ₹5/- తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE115 NAMASTEY MAHAAPRABHA






## న్యూజిలాండ్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రత నమోదు
- తే అనావ్ సమీపంలో కంపించిన భూమి.. 40 కి.మీ. దూరంలో కేంద్రం
- తొలుత 6.3గా అంచనా.. తాజా విశ్లేషణలో 5.9గా నిర్ధారణ
- సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు
- హెచ్చరికల నుంచి సలహాకు మార్పు.. తగ్గిన ముప్పు స్థాయి
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- సముద్రంలోకి వెళ్లొద్దు.. బీచ్‌లకు దూరంగా ఉండాలని పర్యాటకులకు పిలుపు

3

న్యూజిలాండ్‌లో భూకంపం కలకలం సృష్టించింది. దక్షిణ ద్వీపం సమీపంలోని సముద్ర గర్భంలో 5.9 తీవ్రతతో బలమైన ప్రకంపనలు నమోదయ్యాయి. తొలుత భూకంప తీవ్రతను 6.3గా అంచనా వేసిన అధికారులు, అనంతరం తాజా విశ్లేషణల ఆధారంగా దాన్ని 5.9గా సవరించారు. భూకంప కేంద్రం తీర ప్రాంతానికి సుమారు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు గుర్తించారు. భూకంపం సంభవించిన వెంటనే న్యూజిలాండ్ అధికారులు అప్రమత్తమయ్యారు. దక్షిణ ద్వీపంలోని తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. మిల్‌ఫోర్డ్ సౌండ్ నుంచి పుయిసెగర్ పాయింట్ వరకు ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే పరిస్థితిని సమీక్షించిన తర్వాత సునామీ ముప్పు స్థాయిని తగ్గించారు. ప్రస్తుతం పెద్దగా ప్రమాదం లేదని భావిస్తున్నప్పటికీ, తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తలు పాటించాలని అధికారులు సూచించారు. సముద్రంలో అసాధారణ అలలు, నీటి మట్టంలో మార్పులు కనిపించే అవకాశం ఉందని హెచ్చరించారు.




## శవపేటికలో ట్రంప్!

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వేళ తీవ్ర వ్యాఖ్యలతో పోస్టర్
- ఖమేనీ మరణానికి ప్రతీకారం కోరుతున్న ఇరాన్ వర్గాలు
- యుద్ధ పరిణామాలతో అమెరికాపై పెరిగిన వ్యతిరేకత
- ట్రంప్ చిత్రంతో కూడిన హోర్డింగ్ అంతర్జాతీయ చర్చకు దారి
- టెహ్రాన్ వీధుల్లో కనిపించిన ఆగ్రహ సంకేతం

3



## యూపీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

- తెలంగాణ యువతకు ప్రభుత్వం మరో సువర్ణావకాశం
- జూలై 17 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ
- ఎంపికైన వారికి 10 నెలల ఉచిత కోచింగ్‌తో పాటు నెలకు రూ.5 వేల స్టైపెండ్,పుస్తకాల కోసం మరో రూ.5 వేల ఆర్థిక సాయం : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్ జూలై 16,( మహా ప్రభ)**
యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర) పరీక్షలకు సిద్ధమవుతున్న తెలంగాణ యువత కోసం రాష్ట్ర ప్రభుత్వం బీసీ స్టడీ సర్కిల్ ద్వారా ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. జూలై 17 నుంచి ఆగస్టు 7 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తామని, స్క్రీనింగ్ టెస్ట్‌లో ఎంపికైన అభ్యర్థులకు 10 నెలల పాటు ఉచిత కోచింగ్ అందించనున్నట్లు బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గదర్శకత్వంలో అమలవుతున్న ఈ కార్యక్రమంలో ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.5 వేల స్టైపెండ్‌తో పాటు పుస్తకాల కొనుగోలుకు ఒకేసారి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేస్తామని మంత్రి పేర్కొన్నారు.

-మిగతా 3లో

## బోనమెత్తిన గోల్కొండ

### జగదాంబమ్మకు తొలి బోనం సమర్పణ

- పట్టువస్త్రాలు అందజేసిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్
- ఎల్ నినో ప్రభావం తగ్గి తెలంగాణలో సమృద్ధిగా వర్షాలు కురవాలని అమ్మవారిని ప్రార్థించాం: మంత్రి కొండా సురేఖ
- సందర్శకులతో కిటకిటలాడిన గోల్కొండ కోట పరిసరాలు
- అలరించిన పోతరాజుల విన్యాసాలు

**హైదరాబాద్ జూలై 16,( మహా ప్రభ)**
తెలంగాణ జీవన వైవిధ్యానికి, భక్తికి, ఐక్యతకు ప్రతీక అయిన ఆషాఢం బోనాలు గురువారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని గోల్కొండ జగదాంబమ్మకు తొలి బోనం సమర్పించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆషాఢ మాస బోనాల ఉత్సవాల్లో భాగంగా లంగర్‌హౌస్ నుంచి పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య గోల్కొండ కోటలోని శ్రీ జగదాంబ మహంకాళి(ఎల్లమ్మ) అమ్మవారికి మంత్రులు పట్టువస్త్రాలు, బంగారు బోనాన్ని సమర్పించారు. ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు,

-మిగతా 3లో







## ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

- అన్ని వర్గాలనూ మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం
- రేపు సరూర్‌నగర్‌లో యువ సంగ్రామ సదస్సు
- బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులసమావేశంలో కేటీఆర్

**హైదరాబాద్ జూలై 16,( మహా ప్రభ)**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) విమర్శించారు. అన్ని వర్గాలనూ మోసం చేసిన ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువ సంగ్రామ సదస్సును నిర్వహిస్తామని చెప్పారు. గురువారం హైదరాబాద్ నగరానికి చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి నివాసంలో కేటీఆర్ సమీక్ష్? సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ

-మిగతా 3లో

## అమెరికా కంటే చైనాకే మొగ్గు..



3

- ప్యూ సర్వేలో ఆసక్తికర అంశాలు
- 36 దేశాల్లో సర్వే.. 25 దేశాల ప్రజల అభిప్రాయం చైనా వైపు
- ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అధిక ఆదరణ.. సర్వేలో వెల్లడి
- చైనా పట్ల పెరుగుతున్న సానుకూలత.. అమెరికాపై తగ్గుతున్న విశ్వాసం
- స్వేచ్ఛా హక్కుల్లో అమెరికాకు ఆధిక్యం.. జోక్యం విషయంలో చైనాకు మద్దతు
- యూరప్ దేశాల్లోనూ చైనా వైపు పెరుగుతున్న ఆసక్తి
- భారత్, జపాన్, దక్షిణ కొరియా సహా ఆరు దేశాలే అమెరికా అనుకూలం

## మయన్మార్ తీరంలో ఘోర విషాదం..



- రెండు శరణార్థి పడవలు బోల్తా
- 500 మందికి పైగా గల్లంతు.. మృతి చెందినట్లు ఐరాస సంస్థల అంచనా
- రఖైన్ నుంచి బయలుదేరిన పడవలు.. ఎక్కువ మంది రోహింగ్యా ప్రయాణికులు
- బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారూ ఉన్నట్లు సమాచారం
- భారీ ప్రాణనష్టంపై ఐరాస ఆందోళన
- అండమాన్ సముద్రం, బంగాళాఖాతం మార్గం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- తొలి పడవలో 250 మంది.. రెండో పడవలో 280 మంది ప్రయాణికులు

3

## సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తాం

### గత ప్రభుత్వ అవకతవకలను సరిదిద్దుతాం

- జూలూరుపాడు టన్నెల్ పూర్తి చేయడమే లక్ష్యం
- పాలేరు రిజర్వాయర్‌కు గోదావరి జలాలు
- బీఆర్ఎస్ హయాంలో ప్రజాధనం దుర్వినియోగం: భట్టి
- లక్షల ఎకరాలకు నీళ్లిచ్చామన్న ప్రచారం అవాస్తవం: ఉత్తమ్
- సీతారామకు 67 టీఎంసీల నీటి అనుమతులు తెచ్చింది కాంగ్రెస్
- ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు అందిస్తాం: పొంగులేటి
- భూసేకరణకు రూ.135 కోట్లు విడుదలకు నిర్ణయం



**సత్తుపల్లి జూలై 16,( మహా ప్రభ)**
గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలను సరిదిద్ది సీతారామ ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేస్తామని డిప్యూటీ సీఎం, ఆర్థిక మంత్రి మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. సీతారామ ప్రాజెక్టు పనుల పురోగతిని పరిశీలించేందుకు ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం యాతాలకుంటకు వచ్చిన ఆయన నీటిపారుదల శాఖ మంత్రి నల్లమడ ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి యాతాలకుంట సొరంగ కాలువ మార్గాన్ని (టన్నెల్) పరిశీలించారు. అనంతరం ప్రాజెక్టు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. గత ప్రభుత్వ వైఫల్యాలను సరిదిద్దుతూ జూలూరుపాడు టన్నెల్‌ను త్వరితగతిన పూర్తి చేసి పాలేరు రిజర్వాయర్‌ను గోదావరి జలాలతో నింపడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రాజెక్టుల రీ-డిజైన్ పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం

-మిగతా 3లో



## అవినీతి చేస్తే వేటే..

- మంత్రులు, అధికారులకు సీఎం విజయ్ హెచ్చరిక
- లంచాలు, అక్రమాలకు చోటు లేదు..
- ప్రజలకు జవాబుదారీ పాలనే ధ్యేయమన్న తమిళనాడు ముఖ్యమంత్రి
- ఆరోపణలపై సొంత పార్టీ నేతపైనే చర్యలు తీసుకున్న విజయ్
- అవినీతి నిర్మూలనకు ప్రజల సహకారం కోరిన సీఎం
- లంచం అడిగితే ఎదిరించండి.. ప్రజలకు విజయ్ భరోసా
- తప్పు చేసిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలేది లేదని స్పష్టం

**న్యూఢిల్లీ జూలై 16,( మహా ప్రభ)**
తమిళనాడు ముఖ్యమంత్రి సీ జోసెఫ్ విజయ్ అవినీతిపై తన మంత్రులకు, ప్రభుత్వ యంత్రాంగానికి గట్టి హెచ్చరిక చేశారు. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడిన వారికి ఎలాంటి రెండో అవకాశం ఉండదని గురువారం ఓ ప్రకటనలో స్పష్టంచేశారు. ప్రజలకు పారదర్శక, జవాబుదారీతనంతో కూడిన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొంటూ అవినీతిపై జీరో టోలరెన్స్ విధానాన్ని మరోసారి ప్రకటించారు.ఇటీవల అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న తన పార్టీ చెంగల్పట్టు ఈస్ట్ జిల్లా సంయుక్త కార్యదర్శి వీరసామిని విజయ్ పార్టీ నుంచి బహిష్కరించడం సంచలనంగా మారింది. సోషల్ మీడియాలో లంచం తీసుకుంటున్నట్లు ఆరోపణలు వచ్చిన వీడియో వైరల్ కావడంతో.. రాజకీయ విమర్శలు వెల్లువెత్తాయి. దాంతో పార్టీ ప్రాథమిక సభ్యత్వంతోపాటు అన్ని పదవుల నుంచి ఆయనను తొలగించారు. అనంతరం పోలీసులు కూడా ఆయనను అరెస్ట్ చేశారు. అయితే వీరసామి మాత్రం ఇదంతా

-మిగతా 3లో



## నేడు క్యాబినెట్

- పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తికి ఆమోదం
- చట్ట సవరణతో పాత విధానం పునరుద్ధరణ
- సొంత ఆదాయం నేరుగా పంచాయతీ ఖాతాల్లోకి
- ట్రెజరీ నిబంధనల్లో మార్పులకు నిర్ణయం
- సెక్షన్ 70(3) సవరణపై మంత్రివర్గ చర్చ
- స్థానిక సంస్థల ఆర్థిక బలోపేతమే లక్ష్యం
- రేవంత్ అధ్యక్షతన సచివాలయంలో సమావేశం

**హైదరాబాద్ జూలై 16,( మహా ప్రభ)**
రాష్ట్ర మంత్రివర్గం శుక్రవారం భేటీ కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాయంలో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో గ్రామ పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తిని బలోపేతం చేయాలనే కీలకాంశంపై ప్రధానంగా చర్చించనున్నట్టు సమాచారం. తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018లోని సెక్షన్ 70(3)కు సవరణకు సర్కారు సిద్ధమైందని సంబంధింత ఉన్నతా ధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఫైల్‌ను పంచాయతీ రాజ్ శాఖ ఇప్పటికే సిద్ధం చేసింది. దీనికి రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. ప్రస్తుతం గ్రామ పంచాయతీలకు వచ్చే అన్ని నిధులను సమీప ప్రభుత్వ ట్రెజరీలోనే

-మిగతా 3లో

## ఢిల్లీలోని ఎర్రకోట తాత్కాలికంగా మూసివేత..! కారణమిదే



**ఢిల్లీ జులై 16( మహా ప్రభ )**
ఢిల్లీలోని చారిత్రాత్మక ఎర్రకోటను జులై 15 నుండి ఆగస్టు 15 వరకు (నెల రోజులు) మూసి వేయను న్నారు. ఈ నెల 15 నుండి ఆగస్టు 15 వరకు సాధారణ సందర్శకులు, ప్రజల కోసం మూసివేస్తున్నట్లు భారత పురావస్తు శాఖ కీలక ఆదేశాలు జారీ చేసింది. ఎర్రకోట వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పాసులు ఉన్న వారినే లోనికి అనుమతిస్తున్నారు. 2026 ఇండిపెండెన్స్ డే సెలబ్రేషన్స్ నేపథ్యంలో భద్రతా కారణాల దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ జాతీయ వేడుకలు ముగిసిన అనంతరం తిరిగి ఎర్రకోటను పర్యాటకుల సందర్శనార్థం తెరుస్తారు.అప్పటి వరకు పర్యాటకులు సహకరించాలని అధికారులు కోరారు. కాగా, ప్రతి సంవత్సరం దేశ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఎర్రకోట ప్రధాన వేదికగా నిలుస్తుంది. ఇక్కడే దేశ ప్రధాన మంత్రి జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. అతిథులు, వేలాది మంది భద్రతా సిబ్బంది, అధికారులు, హాజరవుతారని భావిస్తున్నందున అధికారులు చాలా వారాల ముందు నుండే విస్తృత ఏర్పాట్లు ప్రారంభించారు.

## వాంగ్‌చుక్‌కు అవసరమైన వైద్యసాయం అందించండి.

- కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు హైకోర్టు ఆదేశాలు



**ఢిల్లీ జులై 16( మహా ప్రభ )**
పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టు కేంద్ర, ఢిల్లీ ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు ఇచ్చింది. వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని, అవసరమైతే ఆయనకు వైద్య సాయం అందించాలని సూచించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. సొలిసిటర్ జనరల్ ను ఆయన ఆరోగ్యం గురించి ప్రశ్నించింది.రోజుల తరబడి ఆహారం తీసుకోకపోవడంతో వాంగ్‌చుక్ ఆరోగ్యం విషమిస్తోంది. ఇదే పరిస్థితి కొనసాగితే ఆయన శరీర అవయవాలు దెబ్బతినే ప్రమాదం ఉందని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. కాగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 28 నుంచి సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష చేస్తున్నారు. నీట్ పేపర్ లీకేజీ ఆరోపణల నేపథ్యంలో విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో ఆయన ఈ దీక్ష చేస్తున్నారు. గడిచిన 18 రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో ఆయన ఆరోగ్యం క్షీణిస్తోంది. దాంతో ఆయన దీక్ష విరమించాలని ప్రతిపక్ష నేతలు కోరుతున్నారు. సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్ష 19వ రోజుకు చేరడం, ఆయన ఆరోగ్యం దెబ్బతింటున్న నేపథ్యంలో ఢిల్లీ హైకోర్టులో పిల్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యాన్ని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించింది. ప్రతి ప్రాణం విలువైందేనన్న న్యాయస్థానం.. అవసరమైతే ఆయన్ను కాపాడటానికి వైద్య సాయం అందించాలని కేంద్రంతోపాటు ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది.

## పూరీ జగన్నాథ రథయాత్రలో అపశృతి..

ఒకరి మృతి.. 100 మందికి గాయాలు..!



**ఢిల్లీ జులై 16( మహా ప్రభ )**
ఒడిశా లోని పూరీ లో గురువారం జరిగిన జగన్నాథ రథయాత్ర లో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా తరలివచ్చిన భక్తుల రద్దీ కారణంగా ఏర్పడిన తొక్కిసలాటలో ఊపిరాడక ఒకరు మరణించినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం పూరీలోని మారిచికుండ్ కూడలి వద్ద ఈ దుర్ఘటన జరిగింది. భక్తులను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన తాళ్ల బారికేడ్ కూలిపోవడం, కొందరు భక్తులు పట్టుతప్పి కింద పడిపోవడంతో ఒకరిపై ఒకరు పడిపోయారు.సుమారు 100 మంది ఒకేచోట పడిపోవడంతో పలువురు గాయపడ్డారు. వారిలో నలుగురైదుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. వెంటనే స్పందించి సుమారు 20 మందిని రక్షించి అంబులెన్స్‌లలో ఆసుపత్రికి తరలించామని, చికిత్స పొందుతూ ఒక వృద్ధుడు మరణించినట్లు తెలిసిందని వారు పేర్కొన్నారు. భారీ జనసందోహం, కుండపోత వర్షం కారణంగా ఊపిరాడక, ఇతర గాయాలతో సుమారు 200 మంది భక్తులు పూరీలోని ఆసుపత్రులలో, తాత్కాలిక వైద్య శిబిరాల్లో చేరినట్లు సమాచారం. లక్షలాది మంది భక్తులు తరలిరావడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. అంతకుముందు గురువారం ఉదయం షెడ్యూల్ కంటే ముందుగానే పహండీ బిజే క్రతువుతో రథయాత్ర ప్రారంభమైంది. అయితే ఊరేగింపు పూర్తికావడానికి మాత్రం రెండు గంటలకుపైగా ఆలస్యమైంది.

# మెదక్ జిల్లా పోలీసుల కీలక విజయం

-50 కిలోల గంజాయి
-రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్

**తూప్రాన్ జూలై 16,( మహా ప్రభ)**
మెదక్ జిల్లా తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ 23.10.2025 నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడు జహాంగీర్ ఖాన్ (38), వట్టేపల్లి, ఫలక్‌నుమా, హైదరాబాద్ ను తూప్రాన్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు గతంలో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ అనంతరం గంజాయి అక్రమ రవాణా మరియు విక్రయాల్లోకి ప్రవేశించాడు. హైదరాబాద్‌కు చెందిన పలువురు సహచరులతో కలిసి నాగ్‌పూర్ నుండి సుమారు 50 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, అద్దెకు తీసుకున్న మారుతి ఎర్టిగా కారు (TS08KA5057) లో హైదరాబాద్‌కు తరలించే ప్రయత్నం చేసినట్లు విచారణలో వెల్లడించాడు.
2025 అక్టోబర్ 22న రాత్రి తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, నిందితులు



ప్రయాణిస్తున్న కారు వేగంగా పారిపోవడానికి ప్రయత్నించి టోల్ బారియర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో కొందరు నిందితులు పోలీసులకు చిక్కగా, జహాంగీర్ ఖాన్ సహా మరికొందరు పరారయ్యారు. పరారీలో ఉన్న జహాంగీర్ ఖాన్ ఇటీవల మరో గంజాయి కేసులో అరెస్టై జైలుకు వెళ్లి, సుమారు 12 రోజుల క్రితం విడుదలైనట్లు పోలీసుల విచారణలో తెలిసింది. తిరిగి నాగ్‌పూర్ వెళ్లి గంజాయి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో 2026 జూలై 16న తూప్రాన్ శివారులోని ఓ ధాబా వద్ద పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడిని చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరుపరుస్తామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది.జిల్లా పోలీసు శాఖ ప్రజలకు విజ్ఞప్తి: గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని డీఎస్పీ తూప్రాన్ శ్రీ జె. నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో, సీఐ తూప్రాన్ శ్రీ ఆశయం వెంకట రాజా గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ వి. గంగరాజు, హెడ్ కానిస్టేబుళ్ ఎల్లయ్య , కానిస్టేబుళు క్రిష్ణ, సురేష్ రవి, సతీష్ సమర్థవంతంగా పని చేసి నిందితుడిని అరెస్టు చేశారు. వారి కృషిని మెదక్ జిల్లా పోలీసు అధికారి డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ అభినందిస్తూ తగిన రివార్డు ప్రకటించారు.

## పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి:

-ఎంపీడీవో భరత్ కుమార్





**తాడ్వాయి,జూలై16 (మహాప్రభ)**
గ్రామాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించేందుకు ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతను పాటించాలని తాడ్వాయి ఎంపీడీవో భరత్ కుమార్, సూచించారు. గురువారం మండలంలోని ఎండ్రియాల్ గ్రామాన్ని సందర్శించిన ఆయన గ్రామంలోని కంపోస్ట్ షెడ్డును పరిశీలించి నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రీ-ప్రైమరీ పాఠశాల, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలించి, పరిశుభ్రతతో పాటు పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సవిత, ఎంఈవో రామస్వామి, గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## రెండు గంటల్లోనే అదృశ్యమైన బాలుడి ఆచూకీ

-భిక్నూర్ పోలీసుల చాకచక్యం..ఎస్పీ అభినందన



**భిక్నూర్, జూలై 16 (మహా ప్రభ)**
భిక్నూర్ మండలంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల నుంచి అదృశ్యమైన 10 ఏళ్ల విద్యార్థిని భిక్నూర్ పోలీసులు కేవలం రెండు గంటల్లోనే గుర్తించి సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగించారు. భిక్నూర్ మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామానికి చెందిన కమ్మరిపల్లి రుత్విక్ (10) భిక్నూర్ తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. గురువారం ఉదయం ప్రార్థన కార్యక్రమం అనంతరం సుమారు 9.15 గంటల సమయంలో బాలుడు కనిపించకుండా పోయాడు. దీంతో పాఠశాల ప్రిన్సిపాల్ సాబావత్ రఘు భిక్నూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ ఆదేశాల మేరకు కామారెడ్డి డీఎస్పీ ఎస్. మధుసూదన్ పర్యవేక్షణలో భిక్నూర్ సీఐ జె. నరేష్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చేపట్టారు. పాఠశాల పరిసర ప్రాంతాలు, సమీప గ్రామాలు, ప్రధాన రహదారులు, బస్‌స్టాండ్లు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా గాలించగా, రెండు గంటల్లోనే బాలుడిని గుర్తించి సురక్షితంగా రక్షించారు. అనంతరం బాలుడిని అతని తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యానికి అప్పగించారు. బాలుడిని వేగంగా గుర్తించిన భిక్నూర్ పోలీసుల పనితీరును జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, డీఎస్పీ ఎస్. మధుసూదన్ అభినందించారు. ఈ సందర్భంగా పిల్లలు లేదా కుటుంబ సభ్యులు కనిపించకుండా పోయిన సందర్భాల్లో ఆలస్యం చేయకుండా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని పోలీసులు ప్రజలకు సూచించారు.

# వర్షాకాల సమావేశాల్లో ఏడు బిల్లులు

ఐదు కొత్త బిల్లులు ఆమోదం
కోసం జాబితా చేసిన కేంద్రం




**న్యూఢిల్లీ జులై 16( మహా ప్రభ )**
పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ఈనెల 20 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ సమావేశాల్లో ప్రవేశపెట్టనున్న బిజినెస్ లిస్ట్‌ను లోక్‌సభ సెక్రెట రీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్ గురువారం విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐదు కొత్త బిల్లులను ప్రవేశపెట్టనుంది. వీటితో ఇప్పటికే లోక్‌సభలో ప్రవేశపెట్టిన రెండు బిల్లులను కూడా ఆమోదించుకునేందుకు జాబితా చేసింది. విదేశీ విరాళాల నియంత్రణ (ఎఫ్‌సీఆర్ఏ) సవరణ బిల్లును ఈ సమావేశాల్లో చర్చించి.. ఆమోదం తెలపనుంది. ఉభయ సభల సంయుక్త కమిటీ పరిశీలనలో ఉన్న 'వికసిత్ భారత్ శిక్షా అధిష్ఠాన్ బిల్లు'ను కూడా ఆమోదించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ఆదాయపన్ను సవరణ బిల్లు (ఆర్డినెన్స్ స్థానంలో), సుప్రీం కోర్టు (న్యాయమూర్తులు సంఖ్య) సవరణ బిల్లు (ఆర్డినెన్స్ స్థానంలో), జనన, మరణాల రిజిస్ట్రేషన్ సవరణ బిల్లు, జాతీయ గౌరవానికి అవమానాలను నివారించే (సవరణ) బిల్లు, సూక్ష్మ, చిన్న అండ్ మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి (సవరణ) బిల్లు వంటి కొత్త బిల్లులను కూడా ఈ సమావేశాల్లో తీసుకురానుంది. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను 33 నుంచి 37కి పెంచేందుకు చట్ట సవరణ చేయనుంది. గ్లోబల్ మార్కెట్ ఒడిదుడుకుల నేపథ్యంలో ఆదాయపు పన్ను చట్టంలో సవరణలు చేపట్టనుంది. జనన, మరణాల ఆలస్యం రిజిస్ట్రేషన్ల నిబంధనలను మరింత కఠినతరం చేయనుంది. జాతీయ గౌరవానికి భంగం కలిగించడాన్ని నిరోధించే చట్టానికి మరికొన్ని సవరణలు చేయనుంది. ఎంఎస్ఎంఈ రంగంలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, ఆలస్యపు చెల్లింపుల పరిష్కారం కోసం సవరణలు చేయనుంది. రాష్ట్రాలు సొంతంగా ఎంఎస్ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిళ్లను ఏర్పాటు చేసుకునేలా చట్ట సవరణ చేయనుంది. ఆగస్టు 13 తో ఈ వర్షాకాల సమావేశాలు ముగుస్తాయి.

**ఎంపీలకు సరికొత్త మార్గదర్శకాలు**
వర్షాకాల సమావేశాల్లో ఎంపీల కోసం సరికొత్త మార్గదర్శకాలను లోక్‌సభ సచివాలయం జారీ చేసింది. ముఖ్యంగా సభలో ప్రజాప్రతినిధుల వ్యక్తిగత గోప్యతను కాపాడటంతో పాటు పార్లమెంటు అంతర్గత భద్రతను మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా.. సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలపై సచివాలయం పూర్తిస్థాయి ఆంక్షలు విధించింది. సభా రికార్డులకు భిన్నంగా రహస్యంగా చిత్రాలు తీయడం, వీడియోలు రికార్డ్ చేయడం వంటి అనధికారిక చర్యలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది. డిజిటల్ భద్రతా ప్రమాణాల దృష్ట్యా సభలోకి ప్రవేశించే ప్రతి ఒక్కరూ ఈ నిబంధనలను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. నూతన ఆదేశాల ప్రకారం.. సభలోకి స్మార్ట్ వాచీలు, స్మార్ట్ కళ్లద్దాలు, పెన్ కెమెరాల వంటి ఎలాంటి నిఘా ఆధారిత గ్యాడ్జెట్లనూ అనుమతించరు. పార్లమెంట్ ఆవరణలో ధర్నాలు, రాజకీయ నిరసనలు చేపట్టడంపై పూర్తి నిషేధం విధించారు. అలాగే సభా సమయాన్ని, వాతావరణాన్ని దెబ్బతీసేలా ప్లకార్డులు ప్రదర్శించడం, ఆయుధాలు తీసుకురావడం వంటి చర్యలను పూర్తిగా నిరాకరించారు. వీటితో పాటు పార్లమెంటు పరిధిలో ఎలాంటి మతపరమైన కార్యక్రమాలు లేదా పూజలు నిర్వహించకూడదని స్పష్టం చేస్తూ, సభా మర్యాదలను, శాంతిభద్రతలను కాపాడేందుకు ఎంపిలందరూ సహకరించాలని లోక్‌సభ సచివాలయం కోరింది.

# న్యూజిలాండ్‌లో భారీ భూకంపం..

- రిక్టర్ స్కేలుపై 5.9 తీవ్రత నమోదు
- తే అనావ్ సమీపంలో కంపించిన భూమి.. 40 కి.మీ. దూరంలో కేంద్రం
- తొలుత 6.3గా అంచనా.. తాజా విశ్లేషణలో 5.9గా నిర్ధారణ
- సౌత్ ఐలాండ్ పశ్చిమ తీరానికి సునామీ హెచ్చరికలు
- హెచ్చరికల నుంచి సలహాకు మార్పు.. తగ్గిన ముప్పు స్థాయి
- తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన
- సముద్రంలోకి వెళ్లొద్దు.. బీచ్‌లకు దూరంగా ఉండాలని పర్యాటకులకు పిలుపు




న్యూఢిల్లీ

న్యూజిలాండ్ లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలు పై దాని తీవ్రత 5.9 గా నమోదైంది. సౌత్ ఐలాండ్ లోని 'తే అనావ్ ' పట్టణానికి సమీపంలో భూకంపం సంభవించడంతో అధికారులు తొలుత సునామీ హెచ్చరికలు జారీచేశారు. అయితే ఆ తర్వాత పరిస్థితిని సమీక్షించి ఆ హెచ్చరికను కేవలం సునామీ సలహాగా సవరించారు. తే అనావ్ పట్టణానికి ఉత్తరంగా దాదాపు 40 కిలోమీటర్ల దూరంలో ఈ భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు.ప్రారంభంలో ఈ భూకంప తీవ్రతను 6.3 గా అంచనా వేసిన అధికారులు.. సౌత్ ఐలాండ్ పశ్చిమ తీర ప్రాంతాలైన మిల్‌ఫోర్డ్ సౌండ్ నుంచి పుయ్‌సెగర్ పాయింట్ వరకు సునామీ హెచ్చరికలు జారీచేశారు. అయితే ఖచ్చితమైన అంచనాల ఆధారంగా భూకంప తీవ్రతను 5.9గా నిర్ధారించి సునామీ హెచ్చరికను తగ్గించారు. ప్రస్తుతానికి సునామీ ముప్పు లేనప్పటికీ, న్యూజిలాండ్ జాతీయ అత్యవసర నిర్వహణ సంస్థ తీరప్రాంత ప్రజలను అప్రమత్తం చేసింది. తీర ప్రాంతాల్లో బలమైన, అసాధారణమైన అలల కదలికలు, అంచనా వేయలేని నీటి ఉప్పెనలు సంభవించే అవకాశం ఉందని పేర్కొన్నది. ప్రజలు, పర్యాటకులు సముద్రంలోకి వెళ్లవద్దని, బీచ్‌లకు దూరంగా ఉండాలని సూచించింది.

## యూపీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

(మొదటి తరువాయి)

నిపుణులైన అధ్యాపకుల బృందంతో అన్ని సబ్జెక్టులపై సమగ్ర శిక్షణ అందించి సివిల్స్‌లో విజయం సాధించేలా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు స్త్రవిఎర్‌బఎవఎతీశ్రీవ.ఎస్త్రస్త్ర.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఆషాఢ బోనాల ఉత్సవాల సందర్భంగా హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహిస్తున్న "లిలి" తెలంగాణ బోనాలు--చేతివృత్తుల వస్తువుల ప్రదర్శన"లిలిలో ఏర్పాటు చేసిన బీసీ స్టడీ సర్కిల్ స్టాల్‌ను మంత్రి సందర్శించారు. ఈ సందర్భంగా స్టడీ సర్కిల్ ప్రచురించిన వార్షిక పుస్తకాలను ప్రముఖులకు అందజేయడంతో పాటు ప్రవేశాల సమాచార బ్రోచర్‌ను విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం వరుస ఉద్యోగ నోటిఫికేషన్లతో యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని, లక్ష్యసాధన కోసం పట్టుదలతో సిద్ధం కావాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ బాలమాయాదేవి, బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## శవపేటికలో ట్రంప్!

- అమెరికా--ఇరాన్ ఉద్రిక్తతల వేళ తీవ్ర వ్యాఖ్యలతో పోస్టర్
- ఖమేనీ మరణానికి ప్రతీకారం కోరుతున్న ఇరాన్ వర్గాలు
- యుద్ధ పరిణామాలతో అమెరికాపై పెరిగిన వ్యతిరేకత
- ట్రంప్ చిత్రంతో కూడిన హోర్డింగ్ అంతర్జాతీయ చర్చకు దారి
- టెహ్రాన్ వీధుల్లో కనిపించిన ఆగ్రహ సంకేతం




న్యూఢీల్లి

పరస్పర దాడులు ఉధృతమైన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను ఒక నల్ల శవపేటికలో పడుకోబెట్టిన భారీ హోర్డింగ్ ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లోని ప్రధాన ఎంగెలాబ్ స్క్వేర్‌లో వెలిసింది. కళ్లు మూసుకుని, జుట్టు చెదిరిపోయి పడుకుని ఉన్న ట్రంప్‌ను చూపిస్తున్న ఆ బిల్‌బోర్డుపై మేము ట్రంప్‌ను చంపుతాము అన్న వాక్యాలు రాసి ఉన్నాయి. ఇరాన్ తనపై హత్యాయత్నం చేసే అవకాశం ఉందని ట్రంప్ ప్రకటించిన కొద్ది రోజులకే ఈ బిల్‌బోర్డు ఏర్పాటు కావడం గమనార్హం.మాజీ సుప్రీం నాయకుడు అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారం తీర్చుకోవాలని ప్రభుత్వానికి సన్నిహితులైన ఇరాన్ పిడివాదులు పిలుపునిస్తున్న తరుణంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. యుద్ధం ప్రారంభమైన మొదటిరోజే మరణించిన ఖమేనీ అంత్యక్రియల కార్యక్రమాలు వారం రోజులపాటు కొనసాగాయి. ఈ సమయంలో అమెరికాపై ప్రజల్లో పేరుకుపోయిన ఆగ్రహం స్పష్టంగా కనిపించింది

## ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది

(మొదటి తరువాయి)

ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కామ్‌లు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు, అనుసరిస్తున్న విధానాలు, సాగిస్తున్న పాలన ప్రజా కంటకంగా మారా యని విమర్శించారు. సీఎం చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని వివరించారు. చివరికి యువత, నిరుద్యోగుల విషయంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం "యూత్ డిక్లరేషన్" పేరిట భారీ మోసం చేసిందన్నారు. వరంగల్ రైతు సభ అనంతరం, శనివారం సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువజన సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు.

## నేడు క్యాబినెట్

(మొదటి తరువాయి)



జమ చేయాలనే నిబంధన ఉంది. దీని వల్ల పంచాయతీలు తమ సొంత ఆదాయాన్ని అవసరమైన సమయంలో వినియోగించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. దీంతో స్థానిక సంస్థల ఆర్థిక స్వతంత్రతపై ప్రతికూల ప్రభావం పడింది. ఈ నేపథ్యంలో వాటి సొంత ఆదాయంపై విధించిన పరిమితులను తొలగించి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతిపాదిత సవరణ ప్రకారం గ్రామ పంచాయతీల సొంత ఆదాయాన్ని ట్రెజరీ ఖాతాలో కాకుండా నేరుగా గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలోనే జమ చేసే అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి, ఆమోదం తెలపనున్నట్టు సమాచారం.

# బోనమెత్తిన గోల్కొండ

(మొదటి తరువాయి)

ఎమ్మెల్యేలు దానం నాగేందర్, నవీన్ యాదవ్, బీసీ కమిషన్ చైర్మెన్ నిరంజన్, ఫిషరీస్ చైర్మెన్ మెట్టు సాయికుమార్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజ రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అల, అడిషనల్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఆలయ చైర్మెన్ ఆకుల చంద్రశేఖర్, వివిధ శాఖల అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలి : మంత్రి కొండా సురేఖ

రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్టు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. తొలి(బంగారు) బోనం సమర్పించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. 1813 సంవత్సరంలో కలరా, ప్లేగు వ్యాధులు ప్రబలిన సమయంలో ప్రజలు అమ్మవారిని ప్రార్థించగా, వ్యాధి తగ్గుముఖం పట్టిందనీ.. అప్పటి నుంచి ఈ బోనాల ఉత్సవం వైభవంగా కొనసాగుతోందని గుర్తు చేశారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కోట్లాది రూపాయలు కేటాయించిందని, తెలంగాణను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని చెప్పారు.

ఐక్యతకు నిదర్శనం బోనాలు

గోల్కొండ బోనాలకు ఘనమైన చరిత్ర ఉందని, ఇవి తెలంగాణ సంస్కృతికి, హిందూ-ముస్లింల ఐక్యతకు నిదర్శనమని హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం విషయంలో పటిష్ట చర్యలు చేపట్టామన్నారు. జంట నగరాల్లోని అన్ని దేవాలయాల్లోనూ బోనాలను ఘనంగా నిర్వహించేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక నిధులను మంజూరు చేశారని, ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పోలీసు శాఖ నిరంతరం నిఘా ఉంచి శాంతిభద్రతలను పర్యవేక్షించాలని ఆదేశించారు.

పోతురాజుల విన్యాసాలు

జాతరలో భాగంగా పోతురాజుల విన్యాసాలు, కళాకారుల ప్రదర్శనలు సందర్శకులను అబ్బురపరిచాయి. వేల సంఖ్యలో జనం తరలిరావడంతో గోల్కొండ కోట జనసంద్రమైంది. శివసత్తుల పూనకాలు, డప్పు దరువులతో కోట పరిసరాలు మారుమోగాయి.

పుస్తకావిష్కరణ -- చెక్కు పంపిణీ

ఈ సందర్భంగా సాంస్కృతిక శాఖ రూపొందించిన 'బోనాలు' పుస్తకాన్ని మంత్రులు ఆవిష్కరించారు. అనంతరం దేవస్థానానికి సంబంధించిన చెక్కును ఈవోకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంచాలకులు ఏనుగు నరసింహారెడ్డి, ఆర్డీవో రామకృష్ణ, ఆలయ ఈవో వసంత, తహసిల్దార్ ప్రవీణ్, నయీముద్దీన్, విద్యుత్, జీహెచ్ఎంసీ, హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్, పోలీస్, ఫైర్, రెవిన్యూ, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# అమెరికా కంటే చైనాకే మొగ్గు..

- ప్యూ సర్వేలో ఆసక్తికర అంశాలు
- 36 దేశాల్లో సర్వే.. 25 దేశాల ప్రజల అభిప్రాయం చైనా వైపు
- ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అధిక ఆదరణ.. సర్వేలో వెల్లడి
- చైనా పట్ల పెరుగుతున్న సానుకూలత.. అమెరికాపై తగ్గుతున్న విశ్వాసం
- స్వేచ్ఛా హక్కుల్లో అమెరికాకు ఆధిక్యం.. జోక్యం విషయంలో చైనాకు మద్దతు
- యూరప్ దేశాల్లోనూ చైనా వైపు పెరుగుతున్న ఆసక్తి
- భారత్, జపాన్, దక్షిణ కొరియా సహా ఆరు దేశాలే అమెరికా అనుకూలం



హైదరాబాద్

భూతల స్వర్గంగా పిలువడే అమెరికాను ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. స్వేచ్ఛా, స్వాతంత్రాలకు పెట్టింది పేరైనా అమెరికాను సందర్శించాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. లేటెస్ట్ టెక్నాలజీ, స్వేచ్ఛాయుతమైన జీవనం వంటి పలు కీలక అంశాల్లో ముందుండే యూఎస్‌ని మెజార్టీ ప్రజలు ఇష్టపడుతుంటారు. కానీ, నేడు పరిస్థితులు అందుకు విరుద్ధంగా మారిపోయాయి. అమెరికా కంటే చైనానే ఎక్కువ మంది ఇష్టపడున్నారని ఇటీవల ఓ సంస్థ నిర్వహించిన సర్వేలో తేలడం ఆశ్చర్యానికి గురి చేసింది. అంతేకాదు ప్రపంచంలో సూపర్ పోలీస్‌గా వెలుగొందుతూ పెద్దన్న పాత్ర పోషిస్తున్న అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కంటే చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌కే ఎక్కువ ప్రజాధరణ లభించడం మరో విశేషం.

ట్రంప్ కంటే జిన్‌పింగ్‌కే అత్యధిక ప్రజాదరణ..


వివరాల్లోకి వెళ్తే..ప్యూ రీసెర్చ్ సెంటర్ ఇటీవల కొత్తగా నిర్వహించిన తాజా గ్లోబల్ సర్వేలో అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ కంటే, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ ప్రపంచవ్యాప్తంగా ఎక్కువ మంది అభిమానాన్ని పొందినట్లు వెల్లడైంది. అమెరికా కేంద్రంగా పనిచేసే ఈ నిష్పక్షపాత సంస్థ వెల్లడించిన ఫలితాల ప్రకారం..36 దేశాల్లో సర్వే చేపట్టగా 25 దేశాల్లోని ప్రజలు అమెరికా కంటే చైనాను ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అలాగే 22 దేశాలలో షి జిన్‌పింగ్‌కు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కంటే ఎక్కువ ప్రజాదరణ ఉందని తేలింది. అనేక దేశాలలో చైనా పట్ల సానుకూల అభిప్రాయాలు రోజు రోజుకు రికార్డు స్థాయికి పెరుగుతుండగా.. మరోవైపు అమెరికా పట్ల సదాభిప్రాయాలు క్షీణించాయి. సాధారణంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా నాయకుడు షీ జిన్‌పింగ్ ఇద్దరిపైనా ప్రజలు తక్కువ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అయినప్పటికీ ట్రంప్ కంటే జిన్‌పింగే ఎక్కువ స్కోరు సాధించారు. వ్యక్తిగత స్వేచ్ఛలను చైనా కంటే అమెరికానే ఎక్కువగా గౌరవిస్తుందని సర్వేలో పాల్గొన్న ప్రజలు తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఇతర దేశాల వ్యవహారాలలో అమెరికా కంటే చైనా తక్కువగా జోక్యం చేసుకుంటుందని బలంగా నమ్ముతున్నారు. ప్యూ సంస్థ ఫిబ్రవరి, మే నెలల మధ్య 36 దేశాలలో 42,000 మందికి పైగా ప్రజలను సర్వే చేసి ఈ వివరాలను వెల్లడించింది.

యూరప్ చూపు చైనా వైపు..

చైనా వైపు మొగ్గు చూపిన దేశాలలో స్పెయిన్, ఇండోనేషియా, ఇటలీ, గ్రీస్, కెనడా ఉన్నాయి. కేవలం ఆరు దేశాలు మాత్రమే అమెరికాకు మద్దతుగా నిలిచాయి. వీటిలో చాలా వరకు అమెరికాకు బలమైన మిత్ర దేశాలుగా ఉన్నవే కావడం గమనార్హం. అవి వరుసగా పోలాండ్, ఫిలిప్పీన్స్, దక్షిణ కొరియా, భారతదేశం, జపాన్, ఇజ్రాయెల్. అలాగే మరో 20 దేశాలలో అమెరికా పట్ల అనుకూల అభిప్రాయం ఇటీవలి కాలంలో స్థిరంగా తగ్గుతూ వస్తోందని కూడా సర్వేలో తేల్చారు. అదే సమయంలో చైనా పట్ల అనుకూల అభిప్రాయం పెరుగుతూ వస్తోందని కూడా ఆ సంస్థ గుర్తించింది.

# మయన్మార్ తీరంలో ఘోర విషాదం..

- రెండు శరణార్థి పడవలు బోల్తా
- 500 మందికి పైగా గల్లంతు.. మృతి చెందినట్లు ఐరాస సంస్థల అంచనా
- రఖైన్ నుంచి బయలుదేరిన పడవలు.. ఎక్కువ మంది రోహింగ్యా ప్రయాణికులు
- బంగ్లాదేశ్ శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారూ ఉన్నట్లు సమాచారం
- భారీ ప్రాణనష్టంపై ఐరాస ఆందోళన
- అండమాన్ సముద్రం, బంగాళాఖాతం మార్గం అత్యంత ప్రమాదకరమని హెచ్చరిక
- తొలి పడవలో 250 మంది.. రెండో పడవలో 280 మంది ప్రయాణికులు



న్యూఢీల్లి

ప్రాణాలకు రక్షణ, మెరుగైన జీవన పరిస్థితుల కోసం శరణార్థులు ప్రమాదకర స్థితిలో సముద్ర ప్రయాణాలు చేస్తున్నారు. ఈ క్రమంలో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఇటీవల శరణార్థులతో వెళ్లిన రెండు పడవలు మయన్మార్ తీరం లో బోల్తాపడి ఉండవచ్చని ఐక్యరాజ్యసమితి అనుబంధ సంస్థలు తెలిపాయి. ఆ పడవల్లో మొత్తం 500 మంది ఉన్నారని, వారంతా మరణించి ఉండవచ్చని పేర్కొన్నాయి.ప్రాథమిక సమాచారం ఆధారంగా ఈ రెండు పడవలు జూన్ చివరలో మయన్మార్‌లోని రఖైన్ రాష్ట్రం నుంచి బయలుదేరాయని, వాటిలో ఎక్కువ మంది రోహింగ్యా జాతికి చెందిన ప్రయాణికులేనని అంతర్జాతీయ వలస సంస్థ, ఐక్యరాజ్యసమితి శరణార్థుల సంస్థ సంయుక్త ప్రకటనలో తెలిపాయి. బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన కొందరూ ఆ పడవల్లో ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనల్లో 500 మందికిపైగా మృతి చెందినట్టు భావిస్తున్నామని పేర్కొన్నాయి.అయితే ఈ ఘటనలు, మృతుల సంఖ్యపై ఇంకా అధికారికంగా ధ్రువీకరణ రాలేదని, అయినా భారీగా ప్రాణనష్టం జరిగి ఉండవచ్చున్న అంశంపై యూఎన్‌హెచ్‌సీఆర్, ఐఓఎమ్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయని సంయుక్త ప్రకటనలో ఆ సంస్థలు పేర్కొన్నాయి. 2025లో అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో దాదాపు 900 మంది రోహింగ్యా శరణార్థులు అదృశ్యమయ్యారు లేదా ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్యసమితి తెలిపింది. దాంతో ఈ సముద్ర మార్గం ప్రపంచంలోనే వలసదారులు, శరణార్థులకు అత్యంత ప్రమాదకర మార్గంగా మారిందని ఐక్యరాజ్యసమితి తెలిపింది. ఐక్యరాజ్యసమితి సంస్థల సమాచారం ప్రకారం.. తొలి పడవ బయలుదేరిన కొద??దిసేపటికే దానితో సంబంధం తెగిపోయింది. అందులో దాదాపు 250 మంది ఉన్నారు. 280 మందితో ప్రయాణించిన రెండో పడవ జూలై 8న మయన్మార్‌లోని ఇరావడీ తీరంలో బోల్తాపడి ఉండొచ్చని భావిస్తున్నారు. సాధారణ నౌకాయాన కాలం ముగిసిన తర్వాత ఈ ప్రయాణాలు జరిగాయని, ఆ సమయంలో సముద్ర పరిస్థితులు సాధారణంగా మరింత ప్రమాదకరంగా ఉంటాయని ప్రకటనలో ఐరాస తెలిపింది. 2026లో కూడా రోహింగ్యా శరణార్థులు, బంగ్లాదేశ్ పౌరులు కలిపి దాదాపు 300 మంది అండమాన్ సముద్రం, బంగాళాఖాతంలో అదృశ్యమైనట్టు సమాచారం అందిందని యూఎన్‌హెచ్‌సీఆర్, ఐఓఎమ్ తెలిపాయి.

## సీతారామను పూర్తి చేస్తాం

(మొదటి తరువాయి)

చేసిందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టుల అంచనాలను భారీగా పెంచి ప్రజాధనానికి నష్టం కలిగించారని ఆరోపించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఖమ్మం జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఇందిరమ్మ సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులను రూపొందించారని, వాటిని పక్కనపెట్టి సీతారామ ప్రాజెక్టును చేపట్టారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల పనులన్నింటినీ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కోసం రూ.135 కోట్లు విడుదల చేయాలని నిర్ణయించామనీ, అవసరమైన బిల్లులను సిద్ధం చేసి వెంటనే పంపాలని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లను ఆదేశించినట్టు తెలిపారు.

లక్షలాది ఎకరాలకు సాగునీరందించినట్టు ప్రచారం : మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

లక్షలాది ఎకరాలకు సాగునీరు అందించినట్టు బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేసుకుంటున్నారని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని సీతారామ ప్రాజెక్టుకు 67 టీఎంసీల గోదావరి జలాల అనుమతులు తెచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. గత ప్రభుత్వం సాయిల్ టెస్టులు నిర్వహిం చకుండా నిర్మాణాలు చేపట్టడం వల్లే మేడిగడ్డ బ్యారేజీ సమస్యలు తలెత్తాయన్నారు. మిగిలిన బ్యారేజీల భద్రతపై కూడా నిపుణుల సూచనలు ఉన్నాయనీ, ప్రస్తుతం మరమ్మతులు చేపడుతున్నామని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టులకు సంబం ధించిన భూసేకరణలో ప్రభుత్వం నిర్ణయించిన విధానం ప్రకారం వేగంగా పరిహారం చెల్లింపులు చేస్తామని, అధికారులు ఈ అంశాన్ని ప్రాధాన్యం గా తీసుకోవాలని సూచించారు.

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలు : మంత్రి పొంగులేటి

కరువు పరిస్థితుల్లోనూ ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం జిల్లాలో ప్రారంభించిన అన్ని నీటిపారుదల పనులను నిజాయితీగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం సీతారామ ఎత్తిపోతల పథకం ద్వారా నాగార్జునసాగర్, వైరా--లంకసాగర్ ప్రాజెక్టులు, ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా సాధ్యమైనంత మేరకు 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్టు తెలిపారు. ప్రారంభించిన ప్రాజెక్టులను డిజైన్ మార్పుల పేరుతో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు దివాకర టీఎస్, అంకిత్, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, సత్తుపల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మొహమ్మద్ రెహానా కమల్, వైస్ చైర్ పర్సన్ బొంతు సుమలత, సత్తుపల్లి, కల్లూరు ఏఎంసీ చైర్మెన్లు దోమ ఆనంద్ బాబు, బాగం నీరజదేవి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఖమ్మం సుడా చైర్మెన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎన్పీడీసీఎల్ డైరెక్టర్ వి. మోహన్ రావు, ఇరిగేషన్ సీఈలు శ్రీనివాస రెడ్డి, ఎం. వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఆర్ అండ్ బీఎస్ఈ యుగంధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి చేస్తే వేటే..

(మొదటి తరువాయి)



పతిపక్షాల కుట్ర అని ఆరోపిస్తున్నాడు. ఈ వ్యవహారంపై ప్రస్తుతం పోలీస్ విచారణ జరుగుతోంది. అధికారంలోకి వచ్చినప్పటి నుంచే పారదర్శక పాలనకు ప్రాధాన్యం ఇస్తున్న విజయ్.. అవినీతిపై రాజీపడబోమనే సంకేతాన్ని వరుస చర్యల ద్వారా ఇస్తున్నారు. ప్రజల సహకారంతోనే అవినీతిని పూర్తిగా నిర్మూలించగలమని ఆయన పదేపదే చెబుతున్నారు. ఈ క్రమంలో మొన్న కరూర్‌లో ఇటీవల నిర్వహించిన ప్రజాసభలో మాట్లాడుతూ.. తన ప్రభుత్వంలో అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి ఏమాత్రం తావుండబోదని తేల్చిచెప్పారు. 'ఎవరైనా లంచం అడిగితే 'ఇవ్వను' అని చెప్పండి. మీ వెంటే నేను ఉంటాను. అయినా ఒత్తిడి చేస్తే ఈ రాష్ట్రాన్ని పాలిస్తున్న విజయ్ మా వెన్నంటి ఉన్నారని ధైర్యంగా చెప్పండి' అంటూ ప్రజలకు భరోసా ఇచ్చారు. అవినీతి, లంచాలు, అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఆయన స్పష్టంచేశారు. ఇక అవినీతి నిర్మూలన కోసం విజయ్ ప్రభుత్వం ఇప్పటికే పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.


## సంపాదకీయం

# చైనా గురించి ఆయాస పడాలా!



దీనమ్మ జీవితం' అన్నట్లుగా చైనాలో ఏ పరిణామం జరిగినా మీడియాలో కొందరు పెద్దలకు పండగే. అధినేత షీ జిన్‌పింగ్ మీద తిరుగుబాటు చేసి కొత్త నేతను ఎన్నుకుంటారంటూ గతంలో ఎంత యాగీ చేసిందీ చూశాము. తరువాత తేలుకుట్టిన దొంగల మాదిరి ఉన్నారు. చైనా ప్రభుత్వం, అభివృద్ధి, సాధించిన విజయాల గురించి ప్రకటించినపుడు అవన్నీ ఉత్తుత్తి అంకెలే అని పిట్టకతలు చెబుతారు. తాజాగా తొలి ఆరునెలల్లో ఆర్థిక రంగంలో తలెత్తిన వడిదుడుకుల గురించి ప్రస్తావించి వివరాలను ప్రకటించింది. దీన్ని పట్టుకొని ఇంకేముంది చైనా అధోగతి పాలవుతోందంటూ చిలవలు పలవలుగా వ్యాఖ్యానాలు చేస్తున్నారు. వర్తమాన సంవత్సరంలో తమ వృద్ధి రేటు లక్ష్యం 4.5 నుంచి ఐదు శాతం వరకు నిర్ణయిం చినట్లు ప్రభుత్వం గతంలో ప్రకటించింది. అయితే ఆరు నెలల్లో వృద్ధి రేటు 4.7శాతమే నమోదైంది. మొదటి మూడు నెలల్లో ఐదుశాతం నమోదు కాగా తదుపరి అది 4.3శాతమే అయింది గనుక సంబర పడుతున్నారు. 'ఇంకా ఆరు నెలల సమయం ఉంది, ఇంకా పెరుగుతుందా, తగ్గుతుందా అన్నది అనేక పరిస్థితుల మీద ఆధారపడి ఉంటుంది. తాజా తగ్గుదలను గుణపాఠంగా తీసుకోవాలని' దేశ పౌరులకు ప్రభుత్వం చెప్పింది. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పెరుగుతున్నప్పటికీ ఆరునెలల్లో 4.7శాతం పెరుగుదలను తక్కువ అంచనావేసి చంకలు కొట్టుకొంటే ఆయాసం తప్ప ఇతర దేశాలకు ఒరిగేదేమీ ఉండదు. చైనాలో వృద్ధి రేటు ఎందుకు తగ్గిందో తులనాత్మకంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది. ప్రపంచ వస్తూత్పత్తి ఫ్యాక్టరీగా పేరు తెచ్చుకున్న చైనా ఇటీవలి కాలంలో తక్కువ ధరల్లో తయారు చేసే వినిమయ వస్తువుల మీద కేంద్రీకరణ తగ్గించింది. అధునాతన సాంకేతిక ప్రక్రియలతో తయారయ్యే, హరిత ఉత్పత్తుల మీద కేంద్రీకరించి పశ్చిమ దేశాలకు సవాలు విసురుతోంది. మార్కెట్‌లో తీవ్రమైన పోటీని ఎదుర్కోవటం అంతతేలిక కాదు, అయినా 'పరుగెత్తి పాలు తాగటం కంటే నిలబడి నీళ్లు తాగటం' మేలన్నట్టు ముందుకు పోతోంది. చిప్స్, మొబైళ్ల తయారీకి ప్రోత్సాహకంగా రూ.1.89లక్షల కోట్లు కేటాయించినట్లు మన కేంద్ర ప్రభుత్వం పన్నెండేండ్ల తరువాత గొప్పగా ప్రకటించింది.అసలు లేనిదాని కంటే కుంటిదో గుడ్డిదో ఏదో ఒక గుర్రం ఉంటే బండిలాగించవచ్చు న్నట్లుగా ఈ చర్యను పరిగణించాలి. వర్తమాన ప్రపంచంలో యంత్రం నుంచి కాఫీ తీసుకోవాలన్నా, యుద్ధ విమానాలను నడపాలన్నా చిప్ కావాల్సిందే. గూగుల్ కృత్రిమ మేధ చెప్పిన సమాచారం ప్రకారం ప్రస్తుతం చైనా రోజుకు 140 కోట్ల చిప్స్ తయారు చేస్తున్నది. మోడీ ప్రకటించిన రాయితీలు అమల్లోకి వచ్చిన తరువాత మన ఉత్పత్తి రోజు 7.5నుంచి ఎనిమిది కోట్ల వరకు పెరుగుతుందట, అప్పటి వరకు చైనా చేతులు ముడుచుకు కూర్చుంటుందా? చిప్స్ తయారీలో ప్రస్తుతం చైనా తిరుగుబాటు ప్రాంతమైన తైవాన్ రాష్ట్రం, అమెరికా, మొత్తంగా ఐరోపా దేశాలు అగ్రస్థానంలో ఉన్నాయి. వాటిని వెనక్కు నెట్టేందుకు చైనా ముందుచూపుతో వ్యవహరిస్తే తిరోగామి ఆలోచనలతో ఉన్న బీజేపీ, దాన్ని సమర్థించే పార్టీలు దేశాన్ని ఎంత వెనక్కు నెట్టాయో అర్థం చేసుకోవచ్చు.వివిధ రంగాలలో దేశం వెనుకబడి ఉండటానికి గాంధీ, నెహ్రూ నాయకత్వాలే కారణమని ఎంతకాలం పనికిరాని మాటలు చెబుతారు? చైనాతో ముడిపడిన సరఫరా గొలుసును బద్దలు కొట్టాలని, భారత్‌ను ప్రత్యామ్నాయంగా తయారు చేయాలని పశ్చిమదేశాలు ప్రయత్ని స్తున్నాయి. నిజమే కదా అనుకొని కేంద్ర ప్రభుత్వం పన్నెండేళ్లు చూసింది. చైనా జెట్ వేగంతో వెళుతుంటే మన భుజాలను మనమే చరుచుకుంటూ విదేశీ పెట్టుబడి అనే కరువని మబ్బులను చూస్తూ ఎడ్ల బండిలో ప్రయాణిస్తున్నాం. వర్తమాన సంవత్సరం జనవరి-జూన్ మాసాల్లో రెండు దేశాల వాణిజ్య లావాదేవీలు రికార్డులను బద్దలు కొట్టి 91.72 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ మొత్తంలో మన దిగుమతులే 79.41 బి.డాలర్లు, చైనా వాణిజ్య మిగులు 67.1బి.డాలర్లు. దీన్ని మరో విధంగా చెప్పాలంటే చైనాకు మనం ఆరునెలల్లోనే అంత మొత్తాన్ని పళ్లెంలో పెట్టి సమర్పించుకున్నాం. ప్రస్తుతం చైనాలో 15వ పంచవర్ష ప్రణాళిక(2026-30) అమలు చేస్తున్నారు. మోడీ అధికారానికి వచ్చిన తరువాత ఏ యేటికాయేడు లక్ష్యాల నిర్దేశంతో దేశాన్ని ఉరుకులు పరుగులు పెట్టిస్తానని నిటి ఆయోగ్ అని పేరుపెట్టారు. దాన్ని వంది మాగధులు మోడినోమిక్స్ అని ప్రచారం చేశారు. ప్రధాని ఆర్థిక సలహాదారులు, ఆ సంస్థ సారధులుగా ఎవరు వస్తే వారి బుర్రలో తలెత్తిన ఆలోచనల గురించి చెప్పారు తప్ప మరొకటి కాదు. మేడిన్ ఇండియా, మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ ఇలా ఎన్ని పేర్లుపెట్టినా పారిశ్రామిక ఉత్పాదకత పెరగలేదు. దిగుమతే దిక్కుగా మారాయి. యావత్ దేశాన్ని దిక్కులేనిదిగా మార్చేశారు. ఎవరైనా ఉద్యోగాలు, ఉపాధి గురించి అడిగితే సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తుల వంటి వారే పరాన్న జీవులు, బొద్దింకలని వర్ణించటాన్ని చూశాము. దాని గురించి మోడీ స్పందించలేదు, మౌనంగా ఉన్నారంటే అర్థం ఆయనదీ అదే భావజాలం, కాదంటారా!

## తెలంగాణలో 'సర్' గడువు పొడిగింపు అక్టోబర్ 12 వరకు సమయం




**రామాయంపేట జూలై 16 మహాప్రభ**

తెలంగాణలో 'సర్' - Special Summary Revision ప్రక్రియ గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది.

**కీలక తేదీలు:**

1. ఎన్యుమరేషన్ ఫారాల స్వీకరణకు తుది గడువు: ఆగస్టు 3
2. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటన: ఆగస్టు 10
3. అభ్యంతరాల స్వీకరణ: ఆగస్టు 10 నుండి సెప్టెంబర్ 9 వరకు
4. తుది ఓటర్ల జాబితా ప్రచురణ: అక్టోబర్ 12

ఓటర్లు తమ వివరాలను సరిచూసుకోవడానికి, పేరు నమోదు/తొలగింపు/మార్పులకు ఈ గడువును ఉపయోగించుకోవాలని అధికారులు సూచించారు. అర్హులైన 18+ వయస్సు ఉన్న వారందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ECI కోరింది.

## కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి

**-మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు**



**పాపన్నపేట, జూలై 16 ( మహాప్రభ )**
పేద ప్రజలకు అండగా ఉంటామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. గురువారం పాపన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను అందజేశారు. ఉచిత విద్యుత్,బస్సు ప్రయాణం,రైతులకు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యపడిందన్నారు. పది ఏండ్ల క్రితం కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇండ్లు,నేడు మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వం కొలువు దీరాక ఇందిరమ్మ ఇండ్లు పేద ప్రజలకు అందిస్తున్నామన్నారు. అన్ని రంగాల్లో రాష్టం అభివృద్ధి సాధించేందుకు తమ ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందన్నారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకటేశం,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,సర్పంచులు పావని గౌడ్,పద్మా రమేష్,శ్రీధర్,శేఖర్,ఏసు,శ్రీశైలం,నాయకులు ప్రభాకర్ రెడ్డి,మల్లప్ప,ఖలీమ్,గౌస్, కిష్టయ్య,శివయ్య,భూమన్న, బాబర్,సూఫీ తదితరులు ఉన్నారు.

## ఎం.కె.ఆర్. డిగ్రీ కళాశాలలో అదనపు గదుల నిర్మాణం కొరకు ఎమ్మెల్యేకు వినతి పత్రం



**దేవరకొండ జూలై 16( మహాప్రభ )**
మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), దేవరకొండలో గత మూడు సంవత్సరాల నుండి పెరుగుతున్న విద్యార్థుల ప్రవేశాలకు అనుగుణంగా అదనపు తరగతి గదుల నిర్మాణం కొరకు మరియు అసంపూర్తిగా ఉన్నా కళాశాల మైదానం ప్రహరీ గోడ నిర్మాణాన్ని పూర్తి చేయుటకు తగిన చర్యలు తీసుకోవాలని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ కి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది. ఈ విషయం పైన ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ రవి మరియు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

## రామాయం పేట మున్సిపాలిటీలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

**-7వ వార్డు బాధితుడికి చైర్ పర్సన్ చేతుల మీదుగా ఆర్థిక సహాయం**




**రామాయంపేట, జూలై16 (మహాప్రభ):**
రామాయంపేట మున్సిపాలిటీ 7వ వార్డుకు చెందిన బొగ్గుల మహేష్ గారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును మున్సిపల్ చైర్ పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు గారు అందజేశారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావులి గారి సహకారంతో మంజూరైన ఈ చెక్కును మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారుడికి అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న మహేష్ కుటుంబానికి ఈ ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడుతుందని చైర్ పర్సన్ అన్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు:**
కౌన్సిలర్ దేవుని రంజిత్, వైస్ ప్రెసిడెంట్ చింతల యాదగిరి, జిల్లా కార్యదర్శి పోచమ్మల గణేష్, మాజీ పట్టణ అధ్యక్షుడు డాకి స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్, మట్టి యాదగిరి తో పాటు యూత్ కాంగ్రెస్ నాయకులు చిలుక విరాట్, భాను ప్రసాద్, దేవుని నరేష్, నరేందర్, సాయి తేజ, సుధీర్ గౌడ్, గణేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. ప్రభుత్వం పేదల వైద్యానికి అండగా ఉంటుందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా సహాయం అందిస్తామని నాయకులు తెలిపారు.

# దరఖాస్తులు రాసే దుర్గాగౌడ్...దూరమయ్యాడు !

**-గుండెపోటుతో ఆకస్మిక మృతి,**
**- గుండ్రని చేతిరాత ఆయన సొంతం**
**-చెరగని జ్ఞాపకంగా మిగిలిపోనున్న పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం.**






**తూప్రాన్ జులై 16,(మహాప్రభ)**
మెదక్ ఉమ్మడి జిల్లాలో దరఖాస్తులురాసే దుర్గాగౌడ్ గా చిరపరిచితుడైన తూప్రాన్ పట్టణానికి చెందిన రామునిగారి దుర్గాగౌడ్ (95) ఇక లేరు.రెండురోజుల క్రితం రాత్రి సమయంలో ఆయన గుండెపోటు కారణంగా ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు ఇద్దరు కొడుకులు,ముగ్గురు కుమార్తెలు మనుమలు,మనుమరాండ్లు ఉన్నారు. ఇదివరకు మండలంలోని ఘనపూర్,వెంకటాపూర్ అగ్రహారం గ్రామాల్లో పోలీస్ పటేల్ గా పనిచేశారు. ఇప్పటికీ ఆయనను దుర్గయ్య పటేల్ గా పిలుస్తుంటారు.అప్పట్లో పెద్ద జాగీర్దార్ బిదురు కిష్టయ్య దగ్గర పనిచేసిన సమయంలో వెంకటాపూర్ అగ్రహారం,దమ్మక్కపల్లి,ఘనపూర్ గ్రామ పేద రైతులకు భూములను ఇప్పిచ్చిన పేరుంది. గత ఎనబై సంవత్సరాల నుంచి అనేక సమస్యలతో దరఖాస్తులు రాయించుకోవడానికి వచ్చే బాధిత ప్రజలకు తన చేతితో ముత్యాల్లాంటి గుండ్రని అక్షరాలతో దరఖాస్తులు రాసిచ్చి అధికారులు,పోలీసుల చేత పేదలకు పనులు జరిగే విధంగా కృషి చేశారు.గుండ్రని అక్షరాల దరఖాస్తులు వస్తే అధికారుల్లో ఒక విధమైన ఆలోచన కలిగేది. ఈ దరఖాస్తు రాసింది ఎవరు,ఎక్కడ ఉంటాడని పోలీసులు,అధికారులు అడిగి గుండ్రని అక్షరాలకు ఫిదా ఆయన సందర్భాలు ఉన్నాయి.ఇప్పటి యువతకు,ఉద్యోగులకు సైతం అంతటి గుండ్రటి అక్షరాలు, దరఖాస్తులు రాసే విధానం, మ్యాటరు గురించి తెలవదు.ఇంత వయసు వచ్చినా, తొమ్మిది పదులు దాటిన వృద్ధాప్యంలోనూ చక్కని ముత్యాల అక్షరాలతో దర్జహస్తులు రాస్తూ అధికారులను ఆశ్చర్యపరిచారు. దుర్గాగౌడ్ రాసిన దరఖాస్తులు పంచాయతీ కార్యాలయాల నుంచి మొదలుకొని కలెక్టర్,ఎస్పీ ఆఫీసు వరకు ప్రతి ఆఫీసుల్లో, పోలీస్ స్టేషన్ లో కనిపిస్తుంటాయి. దరఖాస్తు చూస్తే ఇది తూప్రాన్ దుర్గాగౌడ్ రాసిందే అని గుర్తు పట్టే విధంగా స్వదస్తూరీతో తెల్లని కాగితంపైన గుండ్రటి అక్షరాలను జాలు వారించి దరఖాస్తులతో ప్రజల్లో తనకంటూ ఒక గుర్తింపును తెచ్చుకున్న దుర్గాగౌడ్ ఆకస్మిక మృతి కాగితాలు రాయించుకునే వారికి, కుంటుంబానికి భర్తీ చేయలేని తీరని లోటుగా మిగిలిపోవడం బాధాకరం. దరఖాస్తులు రాసే దురయ్య పటేల్ ఇక లేడు అనే విషయాన్ని ప్రజలు ఇంకా జీర్ణించుకోలేక పోతున్నారు. తూప్రాన్ పట్టణంలోనే ఎక్కువ వయసు కలిగిన వ్యక్తిగా వందేళ్ల కు చేరువైన దుర్గాగౌడ్ అకాల మృతిపట్ల కుటుంబ సభ్యులు అబిమానులు, వివిధ గ్రామాల ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్త పరిచారు.అతడు లేని లోటును ఎవరూ పూడ్చలేనిదని అంటున్నారు. దుర్గాగౌడ్ మృతితో ఒక గుండ్రటి చేతిరాత కనుమరుగైనట్లేనని ప్రజలు బాధను వ్యక్తపరుస్తున్నారు. దరఖాస్తులు రాసే దుర్గాగౌడ్ పటేల్ గా పేరు తెచ్చుకున్న వ్యక్తి గొప్ప కర్షకుడు,శ్రామికుడు అంతకన్నా ఎక్కువ ఆధ్యాత్మిక భావాలు,దైవ చింతన కలిగిన వ్యక్తి, వృక్ష ప్రేమికుడి లక్షణాలు ఆయనలో ఉండేవి. తూప్రాన్ హైవే బైపాస్ రోడ్డులో తన సొంత స్థలంలో, సొంత ఖర్చులతో ఈ ప్రాంతంలో ఎక్కడ లేని ప్రత్యేక శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం నిర్మించిన గొప్ప వ్యక్తి. ఆంజనేయ స్వామి భక్తుడిగా ,నిత్యం ఆలయంలో పూజలు చేస్తూ అక్కడే నివాసం ఉంటూ దేవుడి సేవలో లీనమైన దుర్గా గౌడ్ నిండైన ఆరోగ్యవంతుడిగా ఎలాంటి అస్వస్థతకు గురికాకుండా అకస్మాత్తుగా గుండెపోటుతో గుడి వద్దనే తనువు చాలించడం గొప్ప విషయం. దుర్గాగౌడ్ భౌతికంగా దూరమైనా ఆయన సంకల్పంతో కట్టిన పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయం చిరస్థాయిగా మిగిలిపోయి ఆయనను ప్రజలు గుర్తు చేసుకునే విధంగా చెరగని జ్ఞాపకంగా మిగిలిపోనున్నది. చుక్కల్లో కెక్కినాడు... సక్కనోడు దుర్గాగౌడ్ బంగారం లాంటి చావును అడుక్కోచ్చుకున్నాడు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ చేసిన ఎల్లారెడ్డి ఎమ్మెల్యే



**గాంధారి జూలై 16 (మహాప్రభ)**
రాష్ట్ర గవర్నమెంట్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీఎంఆర్ ఫ్ చెక్కుల పంపిణీ ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ చేతుల మీటిగా సుమారుగా రెండు లక్షల రూపాయల చెక్కు లబ్దిదారుడికు అందించారు. ఈకార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ బండారి పరమేశ్వర్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు సింగసాని శ్రీనివాస్ గండిపేట్ సర్పంచ్ అనూష సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంఘాల విస్తరణకు కృషి చేయాలి

**-మహిళల సమైక్య సమావేశం**



**గాంధారి, జూలై 16 (మహాప్రభ)**
మండల కేంద్రంలో ఐకేపీ కార్యాలయంలో గురువారం మండల మహిళా సమాఖ్య సమావేశం అధ్యక్షురాలు పుష్పరాణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎం ప్రసన్నకుమార్ మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాల్లో లేని మహిళలను గుర్తించి సభ్యులుగా చేర్చాలని సూచించారు. అవసరమైన చోట కొత్త సంఘాలు ఏర్పాటు చేసి మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. సమావేశంలో మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త రామావత్ లక్ష్మణ్‌కు ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ నివాళులు



**దేవరకొండ జూలై 16( మహా ప్రభ)**
చింతపల్లి మండలం దేన్యతండా గ్రామ పంచాయతీ పరిధిలోని తీదేడు ఉమ్మడి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త రామావత్ లక్ష్మణ్ (50) మృతి చెందడంతో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.
ఈ సందర్భంగా రామావత్ లక్ష్మణ్ పార్థివ దేహంపై ఎమ్మెల్యే పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ క్లిష్ట సమయంలో కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పార్టీ అభివృద్ధికి లక్ష్మణ్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జాటావత్ హరి నాయక్, మాజీ అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణం, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్, చందంపేట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొండేటి మల్లారెడ్డి, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కిన్నెర హరికృష్ణ, మాజీ సర్పంచ్ కాయితీ జితేందర్ రెడ్డి, ఉప్పరిపల్లి సర్పంచ్ వెంకటయ్య యాదవ్, మార్కెట్ డైరెక్టర్ హన్మ నాయక్, గ్రామ శాఖ అధ్యక్షుడు రామావత్ శ్రీను నాయక్, శివర్ల శంకర్ యాదవ్, బగ్గ నాయక్, ధర్మ నాయక్, జగన్ నాయక్, బాసు నాయక్, హేము, హన్మంత్, మోత్య నాయక్, మీనా రావు, రాశిక వెంకటేష్, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ రికవరీ యాక్ట్ ను ఎత్తివేయాలి

- సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్.



**దేవరకొండ జూలై 16 ( మహా ప్రభ)**
దేవరకొండ పట్టణంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ అమరవీరుల స్థూపం ముందు విద్యార్థులతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి మౌన దీక్ష తో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ విద్యార్థులపై రెవెన్యూ రికవరీ యాక్టును ఎత్తివేయాలని, జీవో నెంబర్ 9 ను వెంటనే రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఫీజులు కట్టలేక సీట్లను విద్యార్థులు వదులుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెద్ద ఎత్తున నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. విద్యాశాఖ పై అఖిలపక్ష సమావేశం నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలని, విద్యార్థులపై చిన్న చూపు చూడకుండా ఫీజ్ రియంబర్స్మెంట్ విడుదలను తీవ్ర నిర్లక్ష్యం వహించరాదన్నారు. 14 లక్షల మంది విద్యార్థుల భవిత అంధకారంగా మారే ప్రమాదం ఉందని, ప్రభుత్వం ఫీజు రియంబర్స్మెంట్ పథకంపై పూటకో మాట మాట్లాడుతుందని బకాయిలు చెల్లించని యెడల ఎమ్మెల్యేల ఇల్లు ముట్టడిస్తామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, భీమగోని శివ గౌడ్, సొల్లేటి భాస్కరాచారి, పున్న బిక్షమయ్య, మునగాల గణేష్, కాటం వెంకటేష్ గౌడ్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ మైరమ్మ యాడీ ఆలయాన్ని దర్శించుకున్న బిఆర్ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్.



**దేవరకొండ డివిజన్ జూలై 16( మహాప్రభ )**
దేవరకొండ మండలం మైనంపల్లి గ్రామ పంచాయతీ టబ్రిడ్జి తండాఊ లో గురువారం కొలువైన శ్రీ మైరమ్మ యాడీ గుడి కార్యక్రమంలో తండా వాసూలతో పాల్గొని ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించిన బి ఆర్ ఎస్ దేవరకొండ నియోజకవర్గ నాయకులు వడ్త్య రమేష్ అనంతరం వారిని శాలువాతో సత్కరించారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దీప్ల నాయక్, జాను నాయక్,సేవ్య నాయక్, పూజారి బాలు,వినోద్, బాధ్య, గోపాల్, బొజ్య , రాజు, తండా ప్రజలు పాల్గొనారు

## ప్రత్యేక ఉపాధి పనులకు శ్రీకారం



**గాంధారి జూలై 16 (మహాప్రభ)**
ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని గాంధారి మండల కేంద్రంలో ప్రత్యేక ఉపాధి పనులను చేపట్టాలని ఎమ్మెల్యే మదన్ మోహన్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా గురువారం ఫార్మేషన్ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఉపసర్పంచ్ భాస్కర్ గౌడ్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు సాయికుమార్, ఏపీఓ మధు, టెక్నికల్ అసిస్టెంట్ నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ సాయికుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## సీసీటీఎన్ఎస్-2.0, ఆధునిక పోలీసింగ్ సాఫ్ట్‌వేర్‌లపై జిల్లా స్థాయి రైటర్లకు శిక్షణ కార్యక్రమం






**-కేసుల విచారణలో నాణ్యతే లక్ష్యం**

**-బాధితుల సమస్యల పరిష్కారానికి ప్రతి పోలీసు అధికారి బాధ్యతగా కృషి చేయాలి**

**కామారెడ్డి జూలై 16 (మహాప్రభ)**
సీసీటీఎన్ఎస్-2.0ను సమర్థవంతంగా వినియోగించి పోలీసు సేవలను వేగవంతంగా, పారదర్శకంగా అందించా జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్,
జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల రైటర్లు, సీఐ కార్యాలయాలు మరియు డీఎస్పీ కార్యాలయాల రైటర్లకు జిల్లా పోలీస్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రోజున సీసీటీఎన్ఎస్-2.0 (జఋచీూ-2.0) మరియు ఇతర ఆధునిక పోలీసింగ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్ పాల్గొని రైటర్లకు పలు కీలక సూచనలు చేస్తూ దిశానిర్దేశం చేశారు.
ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ స్టేషన్‌కు వివిధ సమస్యలతో వచ్చే ప్రతి బాధితుడికి వేగవంతంగా, పారదర్శకంగా, నాణ్యమైన సేవలు అందించాల్సిన బాధ్యత ప్రతి పోలీసు అధికారిపై ఉందన్నారు. బాధితుల సమస్యల పరిష్కారంలో రైటర్ల పాత్ర అత్యంత కీలకమని, ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.
కేసుల దర్యాప్తు, విచారణ, పరిశోధనలో నాణ్యతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, ఎఫ్ఐఆర్ నమోదు చేసిన దశ నుంచి చార్జ్‌షీట్ దాఖలు చేసే వరకు ప్రతి వివరాన్ని సమగ్రంగా, స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. సాక్షులు, ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలు కేసుల విజయవంతమైన విచారణలో కీలక పాత్ర పోషిస్తాయని, తప్పుడు లేదా అసంపూర్ణ సమాచారం కేసులపై ప్రతికూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు. మారుతున్న సమాజ అవసరాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖ అందుబాటులోకి తీసుకువచ్చిన సీసీటీఎన్ఎస్-2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్ పోర్టల్, పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ వంటి ఆధునిక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై పూర్తి స్థాయి అవగాహనతో పని చేసి, నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతంగా వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. సీసీటీఎన్ఎస్-2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగించడం ద్వారా పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా, ప్రజలకు చేరువగా అందించవచ్చని పేర్కొన్న ఎస్పీ, సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం ద్వారా దర్యాప్తు నాణ్యతతో పాటు ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత పెరుగుతుందని తెలిపారు.
"బాధితుడికి సమయానికి న్యాయం లభిస్తేనే చట్టంపై ప్రజలకు విశ్వాసం పెరుగుతుంది. ఆ విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రతి పోలీసు అధికారికి ఉన్న అత్యంత ముఖ్యమైన బాధ్యత" అని ఎస్పీ స్పష్టం చేశారు.
ఈ శిక్షణ కార్యక్రమంలో కామారెడ్డి రూరల్ ఇన్స్పెక్టర్ శ్రీధర్, ఇతర పోలీసు అధికారులు, జిల్లా లోని అని పోలీస్ స్టేషన్ రైటర్లు, సీఐ మరియు డీఎస్పీ కార్యాలయాల రైటర్లు పాల్గొన్నారు.

# దేవరకొండ పట్టణ భివృద్ధికి ముందడుగు

**నూతన ప్రభుత్వ భవనాల నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**





**దేవరకొండ, జూలై 16 ( మహాప్రభ )**
దేవరకొండ పట్టణ అభివృద్ధికి మరో కీలక అడుగు పడింది. పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల కోసం దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ సంబంధిత అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో స్థల పరిశీలన నిర్వహించారు. ముందుగా నూతన సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నిర్మాణం కోసం ఖిల్లా బజార్‌లోని (పాత బజార్) పాత పోలీస్ స్టేషన్ స్థలాన్ని, అలాగే బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించి, నిర్మాణానికి అనువైన ప్రాంతాలపై అధికారులతో చర్చించారు.అనంతరం పట్టణంలోని ఎమ్మార్వో (తహసీల్దార్) కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. అక్కడ నూతన తహసీల్దార్ కార్యాలయ భవనం నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు, అవసరమైన స్థలం, సౌకర్యాలపై ఎమ్మార్వోతో పాటు సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ మాట్లాడుతూ, "దేవరకొండ పట్టణంలోని పాత బజారుకు కొత్త కలను సాకారం చేస్తూ, ప్రజలకు మెరుగైన ప్రభుత్వ సేవలు అందించే విధంగా ఆధునిక వసతులతో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నాం"అని తెలిపారు. నూతన తహసీల్దార్ (ఎమ్మార్వో) కార్యాలయ భవనం నిర్మాణానికి రూ.2 కోట్ల 25 లక్షలు, అలాగే మున్సిపల్ కార్యాలయ నూతన భవనం నిర్మాణానికి రూ.7 కోట్ల 60 లక్షలు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ భవనాల నిర్మాణంతో దేవరకొండ పట్టణంలో ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా, ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ స్థల పరిశీలనలో ఎమ్మార్వో, మున్సిపల్ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సత్యానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్‌కు ఘన సన్మానం.






**కొత్తపేట - 16 జూలై (మహప్రభ)**
కొత్తపేట డివిజన్ పరిధిలోని సత్యానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ కి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధిగా తన ఐదేళ్ల పదవీకాలాన్ని విజయవంతంగా పూర్తి చేసిన సందర్భంగా అసోసియేషన్ సభ్యులు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నాయకోటి పవన్ కుమార్ మాట్లాడుతూ, ప్రజలు తనపై ఉంచిన విశ్వాసం, ప్రేమాభిమానాలు తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తాయని అన్నారు. కార్పొరేటర్‌గా ఉన్న సమయంలో కొత్తపేట డివిజన్ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన లక్ష్యంగా పనిచేశానని తెలిపారు. పదవి అనేది శాశ్వతం కాదు కానీ ప్రజలతో ఉన్న అనుబంధం శాశ్వతం. ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలే నాకు నిజమైన బలం. ఇకపై కూడా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, డివిజన్ అభివృద్ధి కోసం అదే అంకితభావంతో సేవలను కొనసాగిస్తాను. ఈ ఆత్మీయ సన్మానం చేసిన సత్యానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సత్యానగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, కాలనీ పెద్దలు, యువకులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొని మాజీ కార్పొరేటర్ నాయకోటి పవన్ కుమార్ ని ఘనంగా అభినందించి, ఆయన ప్రజాసేవలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు.

## ధాన్యం కొనుగోలు కుంభకోణంపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

**మహమ్మద్‌నగర్ కోఆపరేటివ్ సొసైటీ పాలకవర్గం డిమాండ్**





**మెదక్ జూలై 16,(మహాప్రభ)**
కౌడిపల్లి మండలం మహమ్మద్‌నగర్ కోఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో జరిగినట్లు ఆరోపిస్తున్న కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని సొసైటీ చైర్మన్ బి. గోవర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన పాలకవర్గ సమావేశంలో తీర్మానించారు.ఈ మేరకు గురువారం మెదక్ జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని ఇన్‌వర్డ్--అవుట్‌వర్డ్ విభాగంలో అధికారులకు ఫిర్యాదు అందజేశారు. అనంతరం జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నిత్యానంద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించి, ధాన్యం కొనుగోళ్లలో జరిగినట్లు ఆరోపిస్తున్న అక్రమాలపై నిష్పక్షపాత విచారణ చేపట్టాలని కోరారు. అలాగే జిల్లా సహకార శాఖ అధికారి పద్మను కలిసి మహమ్మద్‌నగర్ కోఆపరేటివ్ సొసైటీలో జరిగినట్లు ఆరోపిస్తున్న ధాన్యం కొనుగోలు కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు నిర్వహించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ బి. గోవర్ధన్ రెడ్డితో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## రామాయంపేటలో ఘనంగా సమ్మక్క-సారలక్క బోనాల పండగ
### మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు బోనం సమర్పణ



**రామాయంపేట, జూలై 16 ). మహాప్రభ**
1వ వార్డు దాసరి బస్తీ రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు దాసరి బస్తీ కాలనీ వాసుల ఆరాధ్య దైవాలైన సమ్మక్క-సారలక్క దేవతల బోనాల పండగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గారు బోనం ఎత్తుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్రంలో మంచి వర్షాలు కురవాలని, రామాయంపేట పట్టణ, మండల ప్రజలు సుఖశాంతులతో ఉండాలని ఆమె కోరుకున్నారు.
**కార్యక్రమంలో పాల్గొన్న వారు:**
**కౌన్సిలర్లు:**లిగాజవాడ నాగరాజు ,గుగులోత్ రవి, భైరం స్వప్న కుమార్, దేవుని రంజిత్, దాకి శ్యామల స్వామి
కోఆప్షన్ సభ్యురాలు: చింతల రాధాభవాని
DCC **నాయకులు:** ఉపాధ్యక్షులు చింతల యాదగిరి, కార్యదర్శి పోచమ్మల గణేష్
**ఇతరులు:** మాజీ పట్టణ అధ్యక్షులు దాకి స్వామి, మాజీ కౌన్సిలర్ బొర్ర అనిల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు చింతల స్వామి, తొంటవల్లి యాదగిరి, గావు భాస్కర్, అసది రాజు, గావు సురేందర్, యూత్ కాంగ్రెస్ నాయకులు విరాట్, భాను, సుదీర్, గణేష్, నరేష్, సాయి తో పాటు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణాన్ని మామిడి తోరణాలు, బోనాల జెండాలతో అందంగా అలంకరించారు. మహిళలు బోనాలు ఎత్తుకుని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

## తెలంగాణ ఉద్యమకారుల హామీలు వెంటనే అమలు చేయాలి
**ఉమ్మడి నిజాంపేట-రామాయంపేట మండలాల ఉద్యమకారుల డిమాండ్**



**రామాయంపేట, జూలై 16 మహా ప్రభ**
ఉమ్మడి నిజాంపేట-రామాయంపేట మండలాలకు చెందిన సుమారు 15 మంది తెలంగాణ ఉద్యమకారులు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు.
**ఉద్యమకారుల ప్రధాన డిమాండ్లు:**
1. 250 గజాల ఇంటి స్థలం ం నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్
2. ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం
3. ఉచిత RTC బస్ పాస్
4. ఉద్యమకారులకు అధికారిక గుర్తింపు కార్డులు జారీ
5. ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్
6. ఆగస్టు 15, జనవరి 26, జూన్ 2 కార్యక్రమాలకు అధికారిక ఆహ్వానాలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి పోరాటాల్లో జై ళ్లలో బైండోవర్లు లో పాల్గొన్న ఉద్యమకారుల సేవలను ప్రభుత్వం గుర్తించి, గౌరవం, సంక్షేమ పథకాలు అందించాలని వారు డిమాండ్ చేశారు. ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు, మాజీ ఎంపీటీసీ గుండా ఎల్లం, మాజీ ఎంపీటీసీ మైలారం భిక్షపతి, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ చిలుక గంగాధర్ తదితరులు ప్రభుత్వానికి వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం. ఉద్యమకారుల త్యాగాలను మరువొద్దని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా వెంటనే అమలు చేయాలని నాయకులు కోరారు.

## కెసిఆర్ కక్షతో యావత్ తెలంగాణను కరువు కోరల్లోకి నెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.
**-దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్.**



**దేవరకొండ డివిజన్ జూలై 16 ( మహాప్రభ )**
మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజకీయ కక్షతో కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజల ప్రయోజనాలను విస్మరిస్తోందని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ ఆరోపించారు.ఒకవైపు వర్షాభావ పరిస్థితుల కారణంగా గోదావరి బేసిన్‌కు చెందిన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు తగ్గిపోతున్నాయని, మరోవైపు కన్నెపల్లి వద్ద పుష్కలంగా నీరు అందుబాటులో ఉన్నప్పటికీ పంపులను ప్రారంభించి అవసరమైన నీటిని ప్రాజెక్టులకు తరలించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆయన విమర్శించారు.ప్రభుత్వం తక్షణమే స్పందించి నీటి పంపింగ్‌ను ప్రారంభించి, గోదావరి బేసిన్ ప్రాజెక్టులను నింపేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సాగునీటి సరఫరాకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.తెలంగాణ ప్రజల ప్రయోజనాల కంటే రాజకీయ కక్ష సాధింపుకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఆయన ఆరోపించారు.

# దేవరకొండ నియోజకవర్గంలో తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం





**- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్**

**దేవరకొండ, జూలై 16 ( మహాప్రభ )**
దేవరకొండ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ గ్రామీణ నీటిపారుదల శాఖ ( ఆర్ డబ్బు ఎస్.) మరియు మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం ఉన్న తాగునీటి పరిస్థితి, మిషన్ భగీరథ ద్వారా నీటి సరఫరా, పైప్‌లైన్ల నిర్వహణ, మోటార్ల పనితీరు, నీటి నిల్వ సామర్థ్యం, లీకేజీల నివారణ, మరమ్మతులు, నీటి సరఫరాలో ఎదురవుతున్న సమస్యలు తదితర అంశాలపై అధికారులతో ఎమ్మెల్యే సమగ్రంగా చర్చించారు. వేసవి కాలంతో పాటు ఇతర సమయాల్లో కూడా ప్రజలకు ఎలాంటి మంచినీటి కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య తలెత్తితే వెంటనే స్పందించి, యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు. అలాగే మిషన్ భగీరథ పథకం ద్వారా ప్రతి ఇంటికి నాణ్యమైన తాగునీరు నిరంతరాయంగా అందేలా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే బాలు నాయక్ ఆదేశించారు. ప్రజలకు తాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత. దేవరకొండ నియోజకవర్గంలో ఏ గ్రామంలోనూ మంచినీటి సమస్య లేకుండా చూడటమే నా లక్ష్యం. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి”లి అని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో గ్రామీణ నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ శాఖకు చెందిన సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం


**-ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**
**-మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు**

**హైదరాబాద్, జూలై 16,(మహాప్రభ)**
రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో



మర్యాదపూర్వకంగా కలిసి “టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ” ని అందజేసింది.
ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు.
దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మాచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని
# పూర్తిగా కోల్పోయింది





**జూలై 18న సరూర్‌నగర్‌లో జరిగే యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలి**

**ఎల్‌బినగర్ - 16 జూలై (మహప్రభ)**
హైదరాబాద్‌కు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులతో కలిసి ఎల్ బి నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి నివాసంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే.టి. రామారావు కేటీఆర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా కోల్పోయిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమై అన్ని వర్గాలను మోసం చేసిందని విమర్శించారు. ఆడబిడ్డల నుంచి రైతుల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్క వర్గానికి ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని అన్నారు. ప్రజా సంక్షేమాన్ని విస్మరించి అవినీతి, అక్రమాలు, అరాచకాలతో పాలన సాగుతోందని ఆరోపించిన కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. రైతులు సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సమయంలో వారికి భరోసా కల్పించాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. యువత, నిరుద్యోగుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం యూత్ డిక్లరేషన్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా భారీ మోసం చేసిందని కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల ముందు ప్రకటించిన డిక్లరేషన్లలోని హామీల అమలు వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తోందని తెలిపారు. ఈ నేపథ్యంలో జూలై 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో భారీ యువ సంగ్రామ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. సభకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి అడ్డంకులు సృష్టించినా సమర్థంగా ఎదుర్కొని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.హైదరాబాద్‌తో పాటు పరిసర అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి భారీ సంఖ్యలో యువత స్వచ్ఛందంగా సభకు తరలివస్తారని నాయకులు కేటీఆర్‌కు వివరించారు. యువ సంగ్రామ సదస్సు విజయవంతానికి చేపట్టాల్సిన అన్ని ఏర్పాట్లపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు.

# పాపన్నపేట పాఠశాలలో కథక్ నృత్య ప్రదర్శన..

**పాపన్నపేట: జూలై 16( మహా ప్రభ )**
భారతీయ శాస్త్రీయ సంగీతం, నృత్యం, సంస్కృతి, వారసత్వాన్ని యువతకు చేరవేసి వాటి పట్ల ఆసక్తిని పెంపొందించే లక్ష్యంతో స్పిక్ మెకే సంస్థ పనిచేస్తుందని కథక్ కళాకారిణి అనిష్క అగర్వాల్ వెల్లడించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో పాపన్నపేట ఉన్నత కేజీబీవీ పాఠశాలల్లో కథక్ నృత్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కథక్ కళాకారిణి అన్షికా అగర్వాల్ కథక్ నృత్య చరిత్ర, సంప్రదాయం, అభినయం, తాళం, లయ, హస్తముద్రలు, పాద విన్యాసాల గురించి విద్యార్థులకు వివరించారు.




అనంతరం ప్రత్యక్ష నృత్య ప్రదర్శనతో విద్యార్థులను ఆకట్టుకుని, భారతీయ శాస్త్రీయ కళల విశిష్టతను తెలియజేశారు. కళల ద్వారా క్రమశిక్షణ, ఏకాగ్రత, సృజనాత్మకత, భారతీయ సంస్కృతి పట్ల గౌరవం పెంపొందుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్పిక్ మెకే వాలంటీర్ కార్తిక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులుమహేశ్వర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# బిజినెస్

# అలర్ట్.. మళ్లీ షాకిస్తున్న బంగారం ధరలు..

### తెలుగు రాష్ట్రాల్లో తులం ఎంతుందో తెలుసా..?

గత కొంత కాలంగా బంగారం ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల రికార్డు స్థాయిలో దూసుకెళ్లి.. సామాన్యులకు చుక్కలు చూపించిన పసిడి ధరలు.. తగ్గుముఖం పట్టాయి.. బులియన్ మార్కెట్‌లో తగ్గినట్లే తగ్గుతూ.. మళ్లీ పెరుగుతుండటం వినియోగదారుల్లో ఆందోళన కలిగిస్తోంది. అయితే.. ఇరాన్ -- అమెరికా యుద్ధం, అలాగే పలు ప్రాంతాల్లో చోటుచేసుకున్న ఉద్రిక్త పరిస్థితులతో బంగారం, వెండి ధరల్లో ఊహించని మార్పులు చోటుచేసుకుంటున్నాయని బులియన్ మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. ఇదిలాఉంటే.. సోమవారం భారీగా తగ్గిన బంగారం ధరలు, బుధవారం మళ్లీ పెరిగాయి.. ఒక్కరోజే పది గ్రాముల బంగారంపై రూ.770 మేర ధర పెరిగింది. జులై 16 గురువారం పలు వెబ్‌సైట్ల ఆధారంగా ఉదయం 6 గంటల వరకు నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి ధరలు ఈ కింది విధంగా ఉన్నాయి.

**24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాముల ధరపై రూ.10 మేర పెరిగి.. రూ.1,43,580 గా ఉంది.**
**22 క్యారెట్ల పసిడి రేటు 10 గ్రాములపై రూ.10 పెరిగి.. రూ.1,31,610 గా ఉంది.**



వెండి కిలో ధర రూ.100 తగ్గి.. రూ.2,34,900 లుగా ఉంది.

అయితే.. ప్రాంతాల వారీగా బంగారం, వెండి ధరల్లో వ్యాత్యాసం ఉంటుంది.

**ప్రధాన నగరాల్లో బంగారం, వెండి ధరలు ఇలా..**

హైదరాబాద్‌లో గోల్డ్ 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.1,43,580, 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,31,610 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,40,100 ఉంది.

విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,43,580, 22 క్యారెట్ల గోల్డ్ 10గ్రాముల ధర రూ.1,31,610 ఉంది. వెండి కిలో ధర రూ.2,40,100 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,43,730, 22 క్యారెట్ల ధర రూ.1,31,760 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.1,43,580, 22 క్యారెట్ల ధర రూ.1,31,610 గా ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ.143,790, 22 క్యారెట్ల ధర రూ.1,31,810 ఉంది. వెండి కిలో ధర రూ.2,40,100 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,43,580, 22 క్యారెట్ల ధర రూ.1,31,610 ఉంది. వెండి కిలో ధర రూ.2,34,900 లుగా ఉంది.

## ఇకపై 10 నిమిషాల్లోనే గ్యాస్ సిలిండర్ డెలివరీ!



ఎల్పీజీ గ్యాస్ వినియోగదారులకు శుభవార్త. ఇకపై సిలిండర్ బుక్ చేసిన 10 నిమిషాల్లోనే డెలివరీ కానుంది. HPCL కంపెనీతో స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ ఒప్పందం కుదుర్చుకుంది. క్విక్ కామర్స్ విధానంలో భాగంగా 5 కిలోలు, 10 కిలోల సిలిండర్లను డోర్ డెలివరీ చేయనున్నారు. ప్రస్తుతం బెంగళూరులో ఈ సేవలు ప్రారంభమైనా, త్వరలో అన్ని నగరాలకు విస్తరించనుంది. దీనికి ఎలాంటి గ్యాస్ కనెక్షన్ అవసరం లేదు. తొలుత గ్యాస్ బుక్ చేసుకున్న సమయంలో డెలివరీ డాక్యుమెంటేషన్, గుర్తింపు వెరిఫికేషన్ ఉంటుంది. అనంతరం రీఫిల్లింగ్‌కు ఎలాంటి డాక్యుమెంటేషన్ ఉండదు.

## రాయల్ ఎన్‌ఫీల్డ్ క్లాసిక్ 350 కొత్త వెర్షన్ లాంచ్



రాయల్ ఎన్‌ఫీల్డ్ తమ క్లాసిక్ 350 మోడల్‌ను అప్‌డేట్ చేసి దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. దీని ధర రూ.1,87,434 (ఎక్స్-షోరూమ్)గా నిర్ణయించారు. ఈ కొత్త ఎడిషన్‌లో అసిస్ట్ అండ్ స్లిప్పర్ క్లచ్, ఖూదీ టైప్-సీ ఛార్జింగ్ పోర్ట్ వంటి అదనపు ఫీచర్లు చేర్చారు. 349 సీసీ సింగిల్-సిలిండర్ ఇంజన్‌తో 20.2 Bhp పవర్, 27 ఎన్ఎం టార్క్ అందించే ఈ బైక్ 5-స్పీడ్ గేర్‌బాక్స్‌తో వస్తుంది. సస్పెన్షన్ సెటప్‌లో మార్పులు లేవు, డ్యూయల్-ఛానల్ ఏబీఎస్‌తో డిస్క్ బ్రేకులు ఉన్నాయి.

# ఫ్లాట్‌గా ముగిసిన దేశీయ స్టాక్ మార్కెట్లు


దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం స్వల్ప లాభాలతో ప్రారంభమైనప్పటికీ, చివరికి మిశ్రమ ధోరణిలో ముగిశాయి. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ 1.44 శాతం లాభపడి 77,186.87 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు, ఎన్ఎస్ఈ నిఫ్టీ స్వల్పంగా 0.024 పాయింట్లు తగ్గి 24,072.75 పాయింట్ల వద్ద స్థిరపడింది. రోజంతా జరిగిన ట్రేడింగ్‌లో పలు రంగాల షేర్లు కొనుగోలు ఆసక్తిని ఆకర్షించగా, మరికొన్ని విక్రయ ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. లేజర్ పవర్ అండ్ ఇన్‌ఫ్రా, గ్రైండ్‌వెల్ నార్టన్, శ్రీమతి బెక్టర్స్ ఫుడ్ స్పెషాలిటీస్ కంపెనీల షేర్లు లాభాలతో ముగిసి పెట్టుబడిదారులకు మంచి రాబడిని అందించాయి.



ఇదే సమయంలో శ్రద్ధా రియల్టీ, ఐసీఐసీఐ లోంబార్డ్, జేఎన్‌కే ఇండియా కంపెనీల షేర్లు నష్టాల్లో ముగిశాయి. విదేశీ మారకద్రవ్య మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ రూ.96.34 వద్ద కొనసాగింది. మార్కెట్‌లో పెట్టుబడిదారులు కార్పొరేట్ ఫలితాలు, ప్రపంచ మార్కెట్ల ధోరణి, విదేశీ పెట్టుబడుల ప్రవాహాలపై దృష్టి సారించడంతో ట్రేడింగ్ సెషన్ మొత్తం ఒడిదుడుకులు కనిపించినప్పటికీ, చివరికి సూచీలు ఫ్లాట్‌గా ముగిశాయి.

# స్పోర్ట్స్

# ఇంగ్లండ్‌ను చిత్తు చేసి వరుసగా రెండోసారి ఫైనల్‌కు దూసుకెళ్లిన అర్జెంటీనా



అద్భుతమైన ఆటతీరుతో ఫిఫా ప్రపంచకప్ 2026 ఫైనల్లోకి అర్జెంటీనా దూసుకెళ్లింది. అట్లాంటా వేదిక జరిగిన రెండో సెమీ ఫైనల్లో ఇంగ్లండ్‌పై 2-1 తేడాతో చిరస్మరణీయమైన విజయాన్ని అందుకొని ఈనెల 20న స్పెయిన్‌తో జరిగే ఫైనల్ పోరుకు సిద్ధమైంది. హోరా హోరిగా సాగిన మ్యాచ్‌లో ఫస్ట్ ఆఫ్‌లో అర్జెంటీనా కెప్టెన్ మెస్సీని ఇంగ్లండ్ డిఫెండర్లు సమర్ధవంతంగా అడ్డుకున్నారు. మ్యాచ్ 55వ నిమిషంలో ఇంగ్లాండ్ ఆటగాడు ఆంథోనీ గోర్డాన్ అద్భుత గోల్‌తో జట్టుకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. అర్జెంటీనా ఓటమి అంచుల్లో నిలిచిన దశ నుంచి ఊహించని రీతిలో పుంజుకుంది. ఇందులో కెప్టెన్ మెస్సీ పాత్ర కీలకంగా మారింది. మ్యాచ్ ముగియడానికి కేవలం ఐదు నిమిషాల సమయం మాత్రమే ఉన్న దశలో అర్జెంటీనా ఆట స్వరూపాన్నే మార్చేసింది. 85వ నిమిషంలో మిడ్ ఫీల్డర్ ఎంజో ఫెర్నాండెజ్ డి బాక్స్- లాంగ్ రేంజ్ షాట్‌తో బంతిని గోల్ పోస్ట్‌లోకి పంపాడు. దీంతో స్కోరు 1-1తో సమమైంది. ఇక 92వ నిమిషంలో (ఇంజ్యురీ టైమ్) లియోనెల్ మెస్సీ అద్భుతమే చేశాడు. మెస్సీ అందించిన క్లాసిక్ క్రాస్‌ను సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ లౌటారో మార్టినెజ్ హెడర్ ద్వారా గోల్‌గా మలిచి అర్జెంటీనాకు 2-1తో తిరుగులేని విజయాన్ని అందించాడు. దీంతో ఫిఫా వరల్డ్ కప్‌లో మెస్సీ సేన వరుసగా రెండోసారి క్వాలిఫై అయింది. కాగా, ఈ మ్యాచ్‌లో ఓడిపోయిన ఇంగ్లండ్ 19న ఫ్రాన్స్‌తో జరగనున్న మ్యాచ్‌లో మూడో స్థానం కోసం పోటీ పడనున్నది.

# రోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్‌కు ఎండ్ కార్డ్..

**-లార్డ్స్ వన్డేనే రోహిత్ శర్మ చివరి మ్యాచ్?**
**-2027 వన్డే వరల్డ్ కప్ ప్లాన్స్‌లో లేని హిట్ మ్యాన్!**
**-బీసీసీఐ ఇప్పటికే రోహిత్‌కు క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం**



భారత క్రికెట్ అభిమానులకు ఊహించని షాకింగ్ వార్త బయటకు వచ్చింది. టీమిండియా స్టార్ ఓపెనర్, డాషింగ్ బ్యాటర్ రోహిత్ శర్మ అంతర్జాతీయ కెరీర్‌కు ఎండ్ కార్డ్ పడబోతున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఇప్పటికే టెస్ట్, టీ20లకు రోహిత్ గుడ్ బై చెప్పాడు. తాజాగా ఇంగ్లాండ్‌తో చారిత్రాత్మక లార్డ్స్ వేదికగా జరగబోయే వన్డే మ్యాచ్ రోహిత్ శర్మ కెరీర్‌లో చివరి అంతర్జాతీయ మ్యాచ్ అయ్యే అవకాశం ఉందని జోరుగా ప్రచారం జరుగుతోంది. దీనిపై సెలెక్టర్లు ఇప్పటికే అతడితో మాట్లాడి భవిష్యత్తు ప్రణాళికలపై పూర్తి స్పష్టత ఇచ్చినట్లు జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. 2027 లో జరిగే వన్డే ప్రపంచకప్ కోసం సరికొత్త యువ జట్టును సిద్ధం చేయాలని బీసీసీఐ భావిస్తోందని సమాచారం. భారత సెలెక్షన్ కమిటీ 2027 వన్డే వరల్డ్ కప్ ప్రణాళికల్లో రోహిత్ శర్మకు చోటు లేదని తేల్చి చెప్పినట్లు వార్తలు వస్తున్నాయి. ఇంగ్లాండ్ పర్యటన ముగిసిన వెంటనే కొత్త ఓపెనర్లను నిలకడగా పరీక్షించాలని సెలెక్టర్లు భావిస్తున్నారు. అందుకే ఈ ప్రతిష్టాత్మక సిరీస్ తర్వాత రోహిత్ శర్మను వన్డే జట్టు నుంచి పూర్తిగా పక్కన పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని తెలుస్తోంది. రోహిత్ శర్మ వన్డే క్రికెట్‌లో ఇంకా కొనసాగాలని కోరుకుంటున్నా.. జట్టు భవిష్యత్ ప్రణాళికల దృష్ట్యా.. ఈ కఠిన నిర్ణయం తీసుకోక తప్పలేదని బీసీసీఐ వర్గాలు వెల్లడించినట్లు నివేదికలు తెలిపాయి. ఫిట్‌నెస్‌పై రోహిత్ ప్రత్యేకంగా శ్రమించినా కూడా సెలెక్టర్లు మాత్రం.. వన్డే ప్రపంచకప్ 2027 నాటికి యంగ్ ఓపెనర్‌తో బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. యశస్వి జైశ్వాల్‌తో కలిసి గిల్ ఇన్నింగ్స్ ప్రారంభించే అవకాశం ఉందని సమాచారం. సెలెక్టర్ల నిర్ణయంతో రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై తీవ్ర సందిగ్ధత నెలకొంది. అయితే భవిష్యత్తులో ఆట నుంచి ఎలా తప్పుకోవాలనే విషయాన్ని పూర్తిగా రోహిత్ శర్మ వ్యక్తిగత నిర్ణయానికే సెలక్టర్లు వదిలేశారట. దీనిపై హిట్ మ్యాన్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటాడనేది ఇప్పుడు కోట్లాది మంది ఫ్యాన్స్‌లో ఆసక్తికరంగా మారింది. జులై 19న భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా మూడో వన్డే జరగనుంది.

## టి-20ల్లో 1000 సిక్సులు.. పొలార్డ్ అరుదైన రికార్డు



వెస్టిండీస్ స్టార్ క్రికెటర్ కీరన్ పొలార్డ్ అరుదైన ఘనతను సాధించాడు. మేజర్ క్రికెట్ లీగ్‌లో భాగంగా వాషింగ్టన్ ఫ్రీడమ్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో ఎనిమిది సిక్సులు బాదిన అతడు.. పొట్టి ఫార్మాట్‌లో 1000 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు. తద్వారా ఈ ఘనత సాధించిన రెండో క్రికెటర్‌గా నిలిచాడు. ఇప్పటికే ఈ ఘనతను విండీస్ దిగ్గజ క్రికెటర్ క్రిస్ గేల్(1056 సిక్సులు) సాధించాడు. ఇప్పుడు మరో వెస్టిండీస్ క్రికెటరే ఈ ఘనతను సాధించడం విశేషం. ఇప్పటివరకూ 746 టి-20 మ్యాచులు ఆడిన పొలార్డ్ 1001 సిక్సులతో పాటు 923 ఫోర్లు కూడా బాదాడు. ఇక ఈ లిస్ట్‌లో మూడు, నాలుగు స్థానాల్లోనూ వెస్టిండీస్ ప్లేయర్లే ఉన్నారు. 792 సిక్సులతో రసెల్ మూడో స్థానంలో, 764 సిక్సులతో పూరన్ 4వ స్థానంలో ఉన్నారు. ఇక మ్యాచ్ విషయానికొస్తే.. పొలార్డ్ (25 బంతుల్లో 64: ఫోర్, 8 సిక్సులు) విధ్వంసకర ఇన్నింగ్స్‌కి పూరన్ మెరుపు శతకం చేయడంతో ఎంఐ న్యూయార్క్ 20 ఓవర్లలో తొమ్మిది వికెట్లు కోల్పోయి 266 పరుగులు చేసిది. అయితే ఈ భారీ టార్గెట్‌ను ఎంఐ కాపాడుకోలేకపోయింది. ఫ్రీడం బ్యాటర్లు స్టీవ్ స్మిత్(110 నాటౌట్), ఆండ్రియస్ గౌస్(132) సుడిగాలి శతకాలు బాది, మరో 8 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని ఛేధించారు. టి-20 ఫార్మాట్‌లో ఇదే అత్యధిక లక్ష్య ఛేధన.

# హుషార్ పిట్టలు’ నుంచి ‘టోంగా.. టోంగా’ సాంగ్ రిలీజ్




అన్ను, వాసవి గణేషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ‘హుషారు పిట్టలు’ . పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్ర క్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది.దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది’ అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది. సినిమాలో అసలైన మ్యాటర్ సినిమాలో ఉంది. నా సినిమాలో ఉన్న కంటెంట్ నాతో ఇంత కాన్ఫిడెన్స్‌ను ఇచ్చింది’ అన్నారు.



## హాట్ ఫోటో షూట్‌లతో మతిపోగుడుతోన్న శృతి హాసన్...

# టాక్సిక్’ సినిమాను రిజెక్ట్ చేసిన స్టార్ హీరోయిన్ ఎవరో తెలుసా?




కేజీఎఫ్ 2 తర్వాత లాంగ్ గ్యాప్ తీసుకున్న యశ్ ఇప్పుడు టాక్సిక్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. ఇప్పటికే పలు సార్లు వాయిదా పడుతూ వస్తోన్న ఈ హై ఓల్టేజ్ యాక్షన్ ఎంటర్ టైనర్ ఆగస్టు 26న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. భారతీయ భాషలతో పాటు ఇంగ్లిష్ లోనూ ఈ సినిమా రిలీజ్ కానుండడం విశేషం. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న ఈ సినిమాలో ఏకంగా ఐదు గురు హీరోయిన్లు నటిస్తున్నారు. నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్, కియారా అద్వానీ యశ్ తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. ఇప్పటివరకు విడుదలైన టీజర్లు, పాటలను బట్టి చూస్తే, ఈ చిత్రంలో చాలా హాట్ సీన్లు, యాక్షన్ సీన్లు ఓ రేంజ్ లో ఉంటాయని స్పష్టమవుతోంది. అయితే ఇందులో బ్రదర్ అండ్ సిస్టర్ సెంటిమెంట్ కూడా ఉందని తెలుస్తోంది. మరి ఇందులో యశ్ చెల్లెలిగా ఎవరు నటిస్తున్నారన్నది ఆసక్తికరంగా మారింది. కొందరేమో లేడీ సూపర్ స్టార్ నయనతార యశ్ కు సిస్టర్ గా నటిస్తుందని చెబుతున్నారు. ఈ సంగతి పక్కన పెడితే టాక్సిక్ సినిమాలో పలువురు బాలీవుడ్ ముద్దుగుమ్మలు నటిస్తున్నసంగతి తెలిసిందే. కియారా అద్వానీ మెయిన్ హీరోయిన్ అని ఇప్పటికే తెలిసిపోయింది. అలాగే హ్యూమా ఖురేషి, తారా సుతారియా కూడా యశ్ సినిమాలో యాక్ట్ చేస్తున్నారు. అయితే వీరందరి కంటే ముందే ఓ బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కు టాక్సిక్ సినిమాలో అవకాశం వచ్చింది. కానీ ఆమె రిజెక్ట్ చేసింది. అలా చేజేతులా గోల్డెన్ ఛాన్స్ మిస్ చేసుకున్న ఆ ముద్దుగుమ్మ మరెవరో కాదు కరీనా కపూర్.హిందీలో స్టార్ హీరోయిన్ గా వెలుగొందుతోన్న కరీనాకు టాక్సిక్ సినిమాలో నటించే అవకాశం వచ్చింది. ఏ పాత్ర అనేది తెలియదు కానీ యశ్ తో కరీనా నటిస్తుందని తెగ ప్రచారం జరిగింది. ఒక వేళ ఇదే జరిగి ఉందే కరీనాకు ఇదే మొదటి దక్షిణాది సినిమా అయ్యేది . అలాగే ఫస్ట్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ అయ్యేది. అయితే ఏమైందో తెలియదు కానీ ఉన్నట్లుండి టాక్సిక్ సినిమా నుంచి తప్పుకుంది కరీనా. ఆ తర్వాతా ఆమె ప్లేస్ లోకి లేడీ సూపర్ స్టార్ నయనతార చేరిందని తెలుస్తోంది. ఇక టాక్సిక్ సినిమా విషయానికి వస్తే.. కేవీఎన్ ప్రొడక్షన్స్, యష్ మాన్‌స్టర్ మైండ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. అక్షయ్ ఒబెరాయ్, సుదేవ్ నాయర్, అమిత్ తివారీ సహా పలువురు విదేశీ నటీనటులు కూడా నటిస్తున్నారు. ఈ చిత్రానికి రవి బస్రూర్, తనిష్క్ బాగ్చి, ఫహీమ్ అబ్దుల్లా సంగీతం అందిస్తున్నారు. కొన్ని పాటలకు విశాల్ కూడా సంగీతం అందించారు.

# తమిళంలో బంపరాఫర్



‘కాంతార: ఛాప్టర్ 1’ చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపును సంపాదించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఆమె యశ్ ‘టాక్సిక్’, ఎన్టీఆర్ ‘డ్రాగన్’ వంటి భారీ చిత్రాల్లో కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. తాజా సమాచారం ప్రకారం ఈ సొగసరి మరో బంపరాఫర్‌ను చేజిక్కించుకున్నట్లు తెలిసింది. రజనీకాంత్ తాజా చిత్రం ‘ధర్మన్– ది డెడ్లీ డాక్టర్’లో ఈ భామ కీలక పాత్రకు ఎంపికైందని చెన్నై ఫిల్మ్‌నగర్ టాక్. కథాగమనంలో ఆమె క్యారెక్టర్‌కు చాలా ప్రాధాన్యత ఉంటుందని చెబుతున్నారు.‘ధర్మన్’ చిత్రంలో సిమ్రాన్ కథానాయికగా నటిస్తుండగా, రాశీఖన్నా ఇంపార్టెంట్ రోల్‌లో కనిపించనుంది. అశ్వత్ మారిముత్తు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది. అగ్ర నటుడు కమల్‌హాసన్ నిర్మాణ బాధ్యతలు తీసుకున్న ఈ చిత్రానికి అనిరుధ్ రవిచందర్ సంగీతాన్నందిస్తున్నారు.

# ‘ఫౌజీ’ వచ్చేది అప్పుడే



రెబెల్ స్టార్ ప్రభాస్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ ‘ఫౌజీ’తో వెండితెరపై సందడి చేయడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ భారీ పీరియడ్ యాక్షన్ చిత్రం డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. హను రాఘవపుడి దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో, టి–సిరీస్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రాన్ని నవీన్ యెర్నేని, వై. రవిశంకర్, భూషణ్ కుమార్ నిర్మించారు. ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే అద్భుతమైన టైటిల్ పోస్టర్‌తో అంచనాలు పెంచింది. రిలీజ్ డేట్ తో పాటు విడుదల చేసిన కొత్త పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ పోస్టర్‌లో ’ఫౌజీ’ ప్రపంచాన్ని, సినిమా భారీ స్థాయిని అద్భుతంగా ఆవిష్కరించారు. ప్రభాస్ ఇప్పటివరకు ఎప్పుడూ కనిపించని రగ్డ్, ఎమోషనల్ అవతార్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. యుద్ధంలో తీవ్రంగా గాయపడిన ఓ యోధుడిలా, రక్తంతో తడిసిన దుస్తులు, శరీరమంతా గాయాలతో, చుట్టూ నేలకూలిన సైనికుల మధ్య తుపాకీని పట్టుకుని నిశ్శబ్దంగా కూర్చున్న ప్రభాస్ లుక్ అదిరిపోయింది. ఆయన లుక్ ఓ యోధుడి త్యాగం, బాధ, ధైర్యం, పట్టుదలను చూపిస్తోంది. పొడవాటి జుట్టు, గడ్డం, యుద్ధం వల్ల అలసిపోయిన శరీరం, రక్తపు మరకలతో ఉన్న తెల్లటి ధోతీలో ప్రభాస్ చేసిన మేకోవర్ ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగిస్తోంది. తన హావభావాలతోనే బాధ, ధైర్యం, సంకల్పం, ఆత్మవిశ్వాసాన్ని వ్యక్తపరిచే విధంగా పోస్టర్ రూపొందించారు. ముఖ్యంగా ఈ పోస్టర్ సినిమాలోని అత్యంత భారీ యాక్షన్ ఎపిసోడ్‌లలో ఒకదానికి సంబంధించినది. థియేటర్లలో ఈ సీక్వెన్స్ ప్రేక్షకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ’ఫౌజీ’ కేవలం యుద్ధ నేపథ్య చిత్రమే కాకుండా, భావోద్వేగాలతో కూడిన గొప్ప సినీ అనుభూతిని అందించే చిత్రంగా రూపొందుతున్నట్లు పోస్టర్ తెలియజేస్తోంది. ఈ చిత్రంలో ప్రభాస్ సరసన ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా, అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద, భాను చందర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com